గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# డిసెంబర్ 2016
# కథలు




"యువరానర్? ఒంట్లో బాగలేక గత నెలలో హాస్పిటల్ కెళ్ళాను. వారు అన్ని టెస్ట్ లు చేసి నాకున్న రోగాల లిస్ట్ ఇచ్చి వెంటనే ఆపరేషన్ చేయకపోతే సచ్చిపోతావని వార్నింగిచ్చారు. యువరానర్!... వారిచ్చిన లిస్ట్ ఒకసారి చదువుతాను వినండి. కిడ్నీ తెబ్బతిందట. లివర్ పాడయిందట. గుండె వీక్ గా వుందట. ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరిందట. కడుపులో అల్సర్ వుందట. నరాలు దెబ్బ తిన్నాయట. ఇలాగే ఉంటే మెదడు తెబ్బతిని మతిమరుపు వచ్చేస్తుందట. ఇందులో ఏది ముదిరినా ప్రాణం పోవడం ఖాయమట. చూడండి యువరానర్ .ప్రపంచంలో ఉన్న జబ్బులన్నీ నాకే ఉన్నాయి. ఇందుకెవరు కారణం? ఎవరు ... యువరానర్ ..?" ఆవేశంగా ప్రశ్నించాడు వీరేశం అలివేలు వైపు సూటిగా చూస్తూ .

"అదండీ! వరస...అయ్యో! నేనేమి చేసేది దేవుడోయ్! నెలరోజులుగా ఇలాగే తనలో తాను గొణుక్కుంటాడండి. అనవసరంగా నాపైన ఒంటి కాలిపై లేస్తాడండి... మీరే ఏదైనా చేసి నా కాపురాన్ని నిలబెట్టండి జడ్జి గారూ!" అలివేలు అమాయకంగా చేతులు జోడించింది.

"అక్కడే నాకు కాలేది? ఎంత అమాయకంగా నటిస్తుందో చూడండి. ఇక దీన్ని ఏమాత్రం భరించలేనండి. నాకు విడాకులి ప్పించేయండి మహా ప్రభో!" ప్రార్థించాడు వీరేశం.

"అలా కారణం లేకుండా విడాకులంటే కుదరదు. ఆమె చేసిన తప్పేంటో నిరూపించాలి. ఆ తప్పేంటో చెప్పండి?" జడ్జి గారు ప్రశ్నించారు. "అదేనండి నా ఖర్మ? నిరూపించాలంటే ఎలా నిరూపించాలి?"

"చూశారా? జడ్జి గారూ! నన్ను వదిలించుకోవాలని చూస్తున్నాడు." మండిపడింది అలివేలు.

"అదేం కాదు"

"అయితే నీ భార్యపైన అభియోగం ఏమిటి?"

"......"

"అనుమానమా?"

"చీ..ఛీ..కళ్ళు పోతాయి. నా భార్య అపర పతివ్రత."

"మరి. నువ్వు చెప్పినట్లు నడుచుకోవడంలేదా?"

"ఛ...ఛ...నా మాటంటే వేదవాక్కండి."

"అయితే మరేంటి ప్రాబ్లెం...

"నా భార్య నన్ను చంపేయాలని చూస్తోంది."

"అదేంటి?" అదిరిపడ్డారు జడ్జి గారు .

"అదికూడా...సాక్ష్యాధారాలు లేకుండా ...సైలెంట్ గా!" మెల్లగా చెప్పాడు వీరేశం.

"అదెలా సాధ్యం...నిందితులు ఎంత తెలివి మీరినా ఎక్కడో ఒకచోట దొరికిపోతారు కదా?"

"అదే ఆమె క్రిమినల్ బ్రెయిన్ సార్! ఎవరికి అనుమానం రాకుండా ...స్లో పాయిజనిచ్చి కొంత కాలానికి మట్టుబెట్టేస్తుంది."

"కొంత వివరంగా చెప్పండి"

" మందో మాకో పెట్టికాదు. విషం కలిపి కాదు. కత్తుల్తోనో బాంబుల్తోనో కాదు. సైలెంట్ గా ఎవరికి ఎలాంటి అనుమానమూ రాకుండా తిండిపెట్టే చంపేస్తుంది"

"అదెలా...?"

"గంట గంటకు పాలో; జ్యూసో; బ్రెడ్డో; బిస్కట్టో ...అయ్యబాబోయ్ .. ఎలా చెప్పాలండీ! రోజుకి మూడు పూటలు కాదండి. బాబోయ్ ...ఎనిమిది పూటలండి." గజగజ వణకిపోతూ చెప్పుకుపోతున్నాడు వీరేశం.

"అదేనండి. జడ్జిగారూ! అన్నం తింటే ఎవరైనా చచ్చిపోతారా? ఈ వింత ఎవరైనా విన్నారా? వింటే నవ్విపోరా? ...నిక్షేపం లాంటి నా మొగుడికి ఏదో అయింది. .... బాబోయ్. ఓరి దేవుడా! నేనేమి చేసేదిప్పుడు?" ఏడుపు లంకించుకుంది అలివేలు.

అదేనండి, ఆడవారికున్న సౌలభ్యం! మాటకు ముందు ఏడ్చి గగ్గోలు పెట్టేస్తారండి. మొగుడేదో చేసేశాడని సీన్ క్రియేట్ చేసేస్తారండి.

బోలెడంత సానుభూతి పొందేస్తారండి.     అసలు సమస్య మరుగున పడేస్తారండి."

" ఇంతకీ మీ అసలు సమస్య ఏమిటి?" జడ్జి అడిగారు సీరియస్ గా.

"అదేనండీ! తిండి సమస్య?"

"అంటే మీ భార్య మీకు తిండి పెట్టడం లేదా?"

"అయ్ బాబోయ్ ...మీకలా అర్థమయిందా?"

"డాక్టర్ ఏం చెప్పారో     చెప్పండి!నేనెందుకు అంత శ్రద్ధ       తీసుకోవలసి వచ్చిందో అదీ చెప్పండి?" అడిగింది అలివేలు.

"ఏమి చెప్పాడేంటి?" వెటకారంగా అన్నాడు     వీరేశం.

" అలా రా! దారికి...ఇదిగో     జడ్జి గారూ! ఆ మధ్య కళ్ళు తిరిగి పడిపోయాడండి. మరోసారి అలెర్జీ వచ్చి చర్మ మంతా ఊడొచ్చేట్లు గోక్కున్నాడండి. ఇంకో సారి కడుపు నొప్పి వచ్చిందండి.       మరో సారి      తలనొప్పని       పని ఎగ్గొట్టాడండి. కాళ్ళు పీకుతున్నాయి అంటాడండి. నరాలు లాగేస్తున్నాయి అంటాడండి. కడుపులో దేవినట్లుందంటాడండి. ఒకటి కాదండి. రోజుకొకటి. వినలేక డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళానండి. డాక్టర్ గారికే ఈయనకి ఏ రోగమో అంతుబట్టలేదండి. చివరికి పోషకాహారం క్రమం తప్పకుండా ఇమ్మని ఒక లిస్ట్ ఇచ్చి ఆబ్సర్వేషన్లో పెట్టాడండి.

ఆ లిస్ట్ ప్రకారం - ఉదయం 6 గంటలికి ఒక గ్లాస్     పాలు; ఎనిమిదింటికి     మూడు ఇడ్లీలు/       రెండు దోశెలు/బ్రెడ్ జాం;

పదకొండింటికి ఏదైనా పళ్ళ రసం;

ఒంటిగంటకు అన్నం/చపాతి, రెండు కూరలు; పప్పు, ఆకు కూరలు; తాజా కూరగాయలతో; పెరుగు సాయంత్రం నాలుగు గంటలకి బిస్కట్స్/తాజా పళ్ళ రసం; కాఫీ/టీ రాత్రికి మళ్ళీ మధ్యాహ్నం లాగే. వారానికి రెండు సార్లు నాన్ వెజ్; ఎగ్స్; ఉప్పు; కారం; నూనె; మసాలా; కొవ్వు వస్తువులు తగ్గించాలి. యువరానర్! ఇది డాక్టర్ గారిచ్చిన మెను. భర్త ఆరోగ్యం భార్యకు ముఖ్యమవునా? కాదా? నేను డాక్టర్ చెప్పినట్లు తు.చ. తప్పకుండా ఫాలో అవుతున్నాను. ఎటు తిరిగి భర్తే కదా ప్రత్యక్ష దైవం ఇందులో నేను చేసిన తప్పేంటి?" అమాయకంగా అడిగింది అలివేలు.

"నోట్ దిస్ పాయింట్... యువరానర్! " వీరేశం పాయింట్ లేవదీశాడు.

"ఏ పాయింట్?" సందేహంగా అడిగారు జడ్జిగారు.

"చూశారా! మీరు కూడా బుట్టలో పడిపోయారు?"

అర్ధంకాక బుర్రగోక్కున్నారు జడ్జిగారు.

"తన మాటల గారడీతో ఎంతవారినైనా ఇలా పడేస్తుందండి."

కోర్ట్ హాలులో ఘొల్లున నవ్వులు.

"ఆర్డర్...ఆర్డర్..." సుత్తితో బల్లపై కొడుతూ జడ్జి గారు హెచ్చరించారు. హాలులో నిశ్శబ్దం ఆవరించింది. "మీరేం చెప్పదల్చుకున్నారో సూటిగా చెప్పండి"ఆగ్రహం వ్యక్తం చేశారు జడ్జిగారు.

"జడ్జిగారూ! డాక్టర్ రాసిచ్చిన మెనుని కోర్ట్ లో సబ్మిట్ చేయమనండి."

జడ్జి అలివేలు వైపు చూశాడు, సబ్మిట్ చేయమన్నట్టు.

"ఇదేదో కుట్ర జరుగుతోంది. అయినా ఇదిగో తీసుకోండి." ఇచ్చేసింది అలివేలు.

జడ్జి గారు దాన్ని నిశితంగా పరీక్షించి "ఆమె చెప్పిందే ఇందులో ఉంది. మీకేమైనా సందేహమా?" అడిగాడు అతనివైపు చూసి.

"సందేహం ఏమీలేదు జడ్జి గారూ! డాక్టర్ మెను ఇచ్చారు. దాని ప్రకారం ఆమె ఇంతక్రితం కోర్ట్ లో చెప్పినట్లు తు.చ.తప్పకుండా పాటిస్తోంది. ఆ విషయం ఆమె కోర్ట్ లో ఒప్పుకొంది యువరానర్ ! ప్లీజ్ నోట్ దిస్ పాయింట్ ఆల్సో. " అన్నాడు.

"ఓ కే నోటెడ్. వాట్ ఈజ్ యువర్ నెక్స్ట్ పాయింట్?" విసుగ్గా అన్నారు జడ్జిగారు.

"నేను చెప్పలా... ఇలా నెల రోజులు నుంచి పిచ్చి పిచ్చిగా వాగుతున్నాడండి! పిచ్చి ఏమైనా పట్టిందా అని అనుమానంగా వుందండి. లేకుంటే బంగారం లాంటి నా మొగుడు ఇలా అయిపోయాడేంటి చెప్మా!" బోలెడంత ఆశ్చర్యపోయింది అలివేలు.

"యువరానర్! శ్రీమతి అలివేలు గారు నాకు సర్వ్ చేసే ఆహారపదార్థాల్లో విరివిగా పాలు, గ్రుడ్లు, పెరుగు; పప్పులు, ఆకుకూరలు; కూరగాయలు, పండ్లు, బ్రెడ్, జాం; ఐస్ క్రీంస్, నూనెలు ఇస్తున్నట్లు ఆమె ఒప్పుకుంది. కదా... జడ్జిగారూ! "

"అవును. అందులో పాయింటేంటి?"

"చూశారా! నేరాన్ని తనే ఒప్పుకుంది. ఆమెకెంత తెలివున్నా; నా తెలివి ముందు బలాదూర్!" ఎదుటి వ్యక్తిని ట్రాప్ చేసి నిజాన్ని రాబట్టేశానని సంబరపడ్డాడు వీరేశం.

"ఇవంతా విషపూరితాలు ... ఆహారంలో హాలాహలం. యువరానర్ !"

"ఏంటీ?" ఉలిక్కిపడ్డారు జడ్జిగారు.

"అవునండి. నేను నిజమే చెబుతున్నాను. వీటన్నిటిలో విషపూరితమయిన రసాయనాలు మిక్స్ చేయబడ్డాయి. ఇవి తింటే స్లో పాయిజన్ లా క్రమేణా ఆరోగ్యం దెబ్బతిని క్షీణించి ఎవరికి అనుమానం రాకుండా జీవుడు చచ్చి వూరుకుంటాడు. మనమేమో ఆయుస్సు తీరి చచ్చాడనుకుంటాం. అమ్మో... అమ్మో! ఎంత మోసం...ఎంత మోసం. ఇది నేను కనిపెట్టి బయట పెట్టాను కాబట్టి సరిపోయింది కానీ ...లేకుంటే నా ప్రాణాలు ఏమయ్యేవి? " విస్తుపోయాడు వీరేశం.

" ఆమె తినే పదార్థాల్లో విషం కలిపి నిన్ను చంపడానికి ప్రయత్నిస్తోందంటావా?" అడిగారు జడ్జిగారు.

"చిత్తం మహాప్రభో!"

"ఏంటమ్మా! దీనికి నీ సమాధానమేమిటి?"

"అయ్ బాబోయ్! చూశారా... చూశారా? ఎంతెంత అభాండాలు వేసేస్తున్నారో? సొంత మొగుడికి ఎవరైనా విషం పెడ్తారా? మీరే చెప్పండి. నాణ్యమయిన తిండి పెట్టాలని నేనెంత శ్రద్ధ తీసుకుంటానో చెప్పమంటారా?"

"చెప్పండి."

"నేనే స్వయంగా షాప్ కి ఎళ్తానండి. దగ్గరుండి బ్రాండెడ్ కంపెనీ ల సరుకులే కొంటానండి. ధర ఎక్కువైనా పాకెట్ ల లో ఉన్నవే కొంటానండి. ఎక్స్ పైర్ డేట్ చూసి మరీ కొంటాను. షాపు వాళ్ళు మోసం చేయలేరండి. పండ్లు; కూరగాయలయితే ప్రెష్ గా ఉన్నవే కొంటాను." అలివేలు చెప్పుకుపోతోంది.

"ఏంటయ్యా! ఇంత జాగ్రత్తలు తీసుకుంటున్న ఇల్లాలి పైన నిందలేస్తావా?"

"తొందరపడకండి. ఆమె చెప్పేవన్నీ అబద్ధాలే."

"నిజమేమిటో చెప్పు"

" అలా అన్నారు బాగుంది. చూడండి. ఆమె అన్ని జాగ్రత్తలు తీసుకుని సరుకులు కొంటోందంటోంది కదా! అయితే బ్రెడ్ లో పొటాషియం బ్రోమేట్ ఎలా వస్తుంది? అయ్యా! ఈ పొటాషియం బ్రోమేట్ వల్ల క్యాన్సర్, థైరాయిడ్; కిడ్ని ప్రాబ్లెంస్ వస్తాయి యువరానర్ ! ఆమె చెప్పే తాజా పండ్లలో కార్బైడ్ ఎలా వస్తుంది? దీని వల్ల నరాలు, జీర్ణ వ్యవస్థ; కాలేయం దెబ్బ తింటాయి. ఇక న్యూడిల్స్ లో సీసం వుంటోంది. కూల్ డ్రింక్స్ లో పురుగుల మందు అవశేషాలు; ఐస్ క్రీం లో వాషింగ్ పౌడర్... ఇవంతా ఎలా కల్తీ అయ్యాయి. ఎలా? ....ఎలా?..." ఆవేశంతో వూగిపోతూ ప్రశ్నించాడు వీరేశం.

"ఇవంతా మీకెలా తెలుసు? ఆధారాలున్నాయా?" జడ్జ్ గారి ప్రశ్న.

"ఉన్నాయి యువరానర్! ఇవి చదవండి. నిత్యం పేపర్లు కోడై కూస్తున్నాయి. రోజుకో కథనం టీ వీ ల్లో వస్తున్నాయి. అయినా మనలో కదలికల్లేవు. చర్యల్లేవు" అంటూ కొన్ని కాగితాలు; సి డీ లు సమర్పించాడు.

జడ్జ్ గారు వాటిని పరిశీలించి వీరేశం వైపు చూశారు.

“అంతే కాదు యువరానర్! వంటనూనెల్లో కల్తీ; ఉప్పులో కల్తీ; పప్పులో కల్తీ; బియ్యం లో కల్తీ; కూరగాయల్లో ...చివరికి పాలల్లో; గుడ్లల్లో ... ఆఖరికి యువరానర్! ఆఖరికి ..... వీళ్ళ కక్కుర్తి ఎంతగా దిగజారిందంటే... పాల ఉత్పత్తి పెంచడానికి పశువులకు ఇంజెక్షన్స్ యిస్తారు. త్వరగా బరువు పెరగడానికి కోళ్ళకు ఇంజెక్షన్స్ యిస్తారు. ఎక్కువ గుడ్లు పెట్టడానికి ఇంజెక్షన్స్ యిస్తారు....ఇవంతా కృత్రిమంగా. అంతా... అంతా అనారోగ్య హేతువులే. “

"ఇందులో ఆమె తప్పేముంది. బజార్లో దొరికేవేగా తెస్తోంది. పైగా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటోంది కదా! ఏ ఇల్లాలయినా ఇంతకన్నా ఏమి చేయగలదు." జడ్జి ప్రశ్నించారు.

"అదే నేనంటున్నాను. యువరానర్ ! ఏ ఇల్లాలయినా ఇంతకంటే చేయగలిగిందేమీ లేదు. కనుక నా భార్య ఏ తప్పు చేయలేదు. ఏ ఇల్లాలయినా బజార్లో దొరికేవే కొంటారు. అవే వండుతారు. అవే తింటారు. కానీ ఇన్ని అనర్థాలకు తప్పెవరిది యువరానర్!"

ప్రశ్నించాడు వీరేశం.

జడ్జి గారి భ్రుకుటి ముడివడింది. ఆసక్తిగా అతడేమంటున్నాడో వింటున్నాడు.

“యువరానర్ ! ఒకడు హత్య చేస్తే వాడొక్కడే శిక్ష అనుభవిస్తాడు. ఇంకెవడైనా నేరం చేస్తే వాడొక్కడే అనుభవిస్తాడు. కానీ ఈ కల్తీ ఆహార పదార్థాల వల్ల యావత్ జాతి శిక్ష అనుభవిస్తోంది. రోజు రోజుకీ ధరలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు కరువొచ్చినా, సునామీ వచ్చినా మార్కెట్ మాయజాల సునామితో నిత్యావసర వస్తువులకు కరువొస్తుంది. జనాలకి చుక్కలు చూపిస్తారు. అంతేసి ధరలు పోసినా నాణ్యమయిన ఆహారపదార్థాలు అందడంలేదంటే ఎవరిది పాపం? డబ్బులిచ్చి రోగాలు కొనుక్కోవడమంటే ఎవరిదీ పాపం? కోటి విద్యలు కూటి కోసమే. ఆ కూడే విష రసాయానాల పాలయి ఒక్కొక్క అంగాన్ని నిశ్శబ్దంగా బలి తీసుకుంటుంటే మనం నిర్లిప్తంగా చూస్తూ వుందామా? ఆరోగ్యం కోసం అన్నం తింటాం. ఆ అన్నమే కలుషితమయి కాలకూట విషంగా మారితే ...? మనకి తెలియకుండానే అన్నం తింటున్నామని విషం మింగుతున్నాం. మనకు తెలియకుండానే ఒక్కొక్క కల్తీకి ఒక్కొక్క అవయవాన్ని బలి చేస్తున్నాం. క్రమేణా దేహాన్ని రోగాల పుట్ట చేస్తున్నాం ఇలాగే కొనసాగితే వచ్చే తరం పుట్టుకుతోనే పేషంట్లయ్యే ప్రమాదం ఉంది. దీనికి కారణం వ్యాపారస్తులందామా? లంచాలకు మరిగిన అధికారులందామా? పట్టించుకోని ప్రభుత్వమందామా?”

కోర్ట్ హాలంతా నిశ్శబ్దంగా వింటోంది. ఆవేశాన్ని ఆపుకుంటూ మళ్ళీ కొనసాగించాడు వీరేశం.

"క్షమించండి జడ్జి గారూ! ఒక ముఖ్యమైన విషయాన్ని కోర్ట్ దృష్టికి తీసుకురావడానికే మా ప్రయత్నం. తత్ ద్వారా యావత్ దేశాన్ని మేలుకొలపాలని మా ఆరాటం. పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించి సంబంధించిన వారికి ఆదేశాలిస్తారని మా విన్నపం. సంపాదన ముఖ్యమే కానీ... కక్కుర్తి కూడదు. కొన్ని కొన్ని విషయాల్లో దానికి మించిన సామాజిక బాధ్యత ప్రతి పౌరుడి మీద ఉంది.... ప్రత్యేకించి వ్యాపారస్తులకు ప్రజల ఆరోగ్యం విషయంలో! సామాన్య మానవుడు అందరిని నమ్ముతాడు. వ్యాపారస్తున్ని నమ్ముతాడు. డాక్టర్ని నమ్ముతాడు. పాలవాన్ని నమ్ముతాడు. కూరవాన్ని నమ్ముతాడు. చివరికి కసాయివాన్ని కూడా నమ్ముతాడు. ధరలెంత చెప్పినా నమ్ముతాడు కాయకష్టం చేసి చెమటోడ్చి సంపాదించిందంతా వాళ్ళ చేతుల్లో పెడతాడు. కానీ వాళ్ళేమి చేస్తున్నారు? ఆ నమ్మకాన్నే పెట్టుబడిగా మార్చేస్తున్నారు. విలువకు తగిన నాణ్యమయిన వస్తువులు కానీ; సేవలు కానీ అందివ్వడం లేదు. అన్నింటిలోనూ అవినీతి...కల్తీ. చివరికివి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేస్తున్నాయి. వాళ్ళ జీవితాల్తో చెడుగుడు ఆడేస్తున్నాయి. ప్రజలు నిస్సహాయంగా అవే వాడేస్తున్నారు. తమకు తెలియకుండానే కల్తీల బారిన పడి; కాలక్రమేణా అంతులేని రోగాలకు బలయి పోతున్నారు. వ్యాపారుల కక్కుర్తి ... అత్యాశలతో అసలు మార్కెట్ లో కల్తీ లేని సరుకంటూ దొరకడం లేదు. చివరికి పెద్ద పెద్ద కంపెనీలే అక్రమాలకు పాల్పడుతున్నాయి. కల్తీని అరికట్టవలసిన యంత్రాంగం లంచాల మత్తులో జోగుతోంది. అక్కడక్కడా కేసులు పెట్టినా తాత్కాలికమే! శాశ్వత పరిష్కారానికి మీరేమయినా చేయగలరేమోనని... చిన్న ఆశ? అన్ని వ్యవస్థలు కుప్పకూలినప్పుడు; మత్తులో జోగుతున్నప్పుడు నాలాంటి సామాన్య

మానవుడు న్యాయవ్యవస్థ వైపు చూడడం పరిపాటయిపోయింది యువరానర్? తప్పయితే క్షమించండి. ఒప్పయితే ఏదో ఒకటి చేయండి యువరానర్!.... ఏదో ఒకటి చేయండి యువరానర్!" అరుస్తూ కుప్పకూలిపోయాడు వీరేశం.

ఒక సగటు మానవుని ప్రతినిధిగా ప్రశ్నిస్తున్న వీరేశం ఆవేశానికి ముగ్ధుడయ్యారు జడ్జ్ గారు. అతడిచ్చిన సాక్ష్యాలలోని నిజాలకి ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచింది. ఆ నిజాల్ని జీర్ణించుకోవడానికి ఆయనికి కొంత టైం పట్టింది. భవిష్యత్ పై భయమేసింది. యావత్ జాతిపై ఆందోళన కలిగింది.

సాలోచనగా తల పంకించి ఆలోచనలో పడ్డారు జడ్జిగారు.

"చెప్పండి యువరానర్...చెప్పండి?" అరుస్తూనే ఉన్నాడు వీరేశం.

* *
*

"ఏమండి! ఏమయింది?" కుదిపి లేపింది భర్తను అలివేలు.

" ఆ ..." ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు వీరేశం.

"ఏంటి? యువరానర్... యువరానర్... అంటూ ఏవేవో గొణుక్కుంటున్నారు. కలేమయినా కన్నారా?" అడిగింది.

"ఇదంతా కలా..." అని మనసులోనే నిట్టూర్చి; కలను ఒకసారి గుర్తుచేసుకున్నాడు వీరేశం.

"తెల్లారడానికి ఇంకా చాలా టైముంది. ఆలోచనలు మాని ప్రశాంతంగా పడుకోండి" అని దుప్పటి సరిగ్గా కప్పింది అలివేలు.

"ఎప్పటికైనా తెల్లవారుతుంది అలివేలూ! చీకటి విడిపోతుంది. అంతవరకు వెయిట్ చేయకతప్పదు... తప్పదు" అనుకుంటూ అటు తిరిగి పడుకున్నాడు వీరేశం.*




“రండి అర్జునరావుగారు! రండి!! ఏమిటిలా వచ్చారు? ఏదైనాపనా మాఆఫీస్ లో?” అనడిగాడు ఆ ఆఫీస్ సూపరింటెండెంట్, తన పక్కనున్న డస్ట్ బిన్లోకి నోట్లో పాన్ ఉమ్మి, తన గారపళ్ళు బయటపడేలా నవ్వుతూ.

“అవునండీ! మా ఇంటిప్లాన్ ఎప్రూవల్ ఎంతవరకొచ్చిందో తెలుసుకుందామని” అన్నాడు అర్జునరావు.

“మీ ఇంటిప్లానా! చెప్పలేదేం సార్ ఇంతవరకూ! దీనికి మీరేరావాలా? మీ స్టాఫ్ నెవర్నైనా పంపినాపోయేదిగా? ఎప్పుడుపెట్టారూ? నేనో పదిహేన్రోజులూర్లోలేను మరి.“ అని అంటూనే, ‘ఏయ్! రమణా! సార్ ఇంటి ప్లాన్ ఫైల్ ఇలా పట్రా!’ అని పురమాయించాడు అటెండెంట్ కి. ఆ ఫైల్ వచ్చేలోగా కాఫీ ఆర్డర్ చేసి తెప్పించాడు అర్జునరావు కి.

ఆ మున్సిపల్ఆఫీస్ లో అంతమర్యాద పొందుతున్న అర్జునరావు ఇంకో ప్రభుత్వాఫీసులో బాధ్యతాయుతమైన పోస్ట్ లో ఉన్న ఆఫీసర్. మున్సిపల్ ఆఫీస్ వారు ఆయన ఆఫీస్ కి ఏవో కొన్ని పన్లు మీద రాకపోకలు సాగిస్తుంటారు. అందుకని వారిమధ్య ఉన్న 'సత్సంబంధాలు' ఈరోజు అర్జునరావు అంతమర్యాద పొందడానికి కారణం.

అర్జునరావు ఫైల్ చూసి. "మీ పనికదా సార్. అందుకే త్వరగా చేసిపెట్టారు మావాళ్లు. సార్ సంతకానికి రెడీగా ఉంది. మీరు రేపోసారి ఫోన్ చేసి రండి. అప్రూవల్ లెటర్ తీస్కెళ్ళురుగాని" అని నవ్వి "మనలో మాట.. మీరు నాకు బాగా క్లోజ్ సార్. అందువల్ల మీదగ్గర్నుండి నేనేం ఆశించనుగానీ, మా మిగతావాళ్ళకి మీతో అంత టచ్ లేదుగా సార్. అంచేత వాళ్ళ ఎక్స్పెక్టేషన్స్ ఏవో వాళ్ళకుంటాయి. హి! హ్హి!! తమకి తెలియంది కాదు. మామూలుగా మా రేట్ అని కాదుగానీ, ఏదో తమకి తోచినంత రేపొచ్చినప్పుడు ఎరేంజ్ చేస్తే, లెటర్ రెడీచేయించి ఉంచుతాను. పట్టుకుపోదురుగాని" అని మళ్ళీ తన గారపళ్ళు బయటపెట్టాడు ఆ సూపరింటెండెంట్, మేమెవ్వర్నీ వదలంసుమా అన్నట్టు.

"ఒకే! ష్యూర్. రేపటికి రెడీ చేసుంచాలి మరి." అన్నాడు దర్పంగా అర్జునరావు.

"ఎంతమాట సార్. ఇది నాపనే అనుకుంటాను. రేపు ఈటైమ్ కి మీరొచ్చి మీ పేపర్స్ తీస్కోవడమే!" అన్నాడు మళ్ళీ గార పళ్లతో. "నీ పనే అయితే మళ్ళీ మామూలెందుకురా నీకు! నీ స్టాఫ్ పేరు చెప్పి, నీవాటా నువ్వు నొక్కేయవా ఏం!? పెద్ద! నాకు ఏమీ తెలియనట్టు" అననుకుంటూ అతనికి షేక్ హాండిచ్చి బయల్దేరాడు అర్జునరావు.

*********

అర్జునరావు కూడా బాగా "సంపాదించే సీటులోనే ఉన్నాడు. తెల్లారిలేస్తే ఎన్నో పనులమీద జనం ఆ ఆఫీస్ చుట్టూ తిరుగుతారు. కావాల్సినపనికి అప్లికేషన్ పెట్టినదగ్గరనుండి, పనిపూర్తయి తీసుకున్న కాగితాలమీద ఆఫీస్ ప్యూన్ ఆఫీస్ సీల్ వేసేవరకు అందరికీ ఏరోజుకారోజు దక్షిణలు సమర్పించుకోందే ఏపని జరగదు అక్కడ. సాయంత్రం వాటాల కార్యక్రమంలో తనవంతుఎంతో లెక్కకట్టి మరీ తీసుకుంటాడు అర్జునరావు. అందుకే అతన్ని పరోక్షంగా "ఆర్జనరావు" అని పిలుస్తారు. ఒకట్రెండు సార్లు ఏసీబీ వాళ్ళ దృష్టి ఇతని మీద పడబోతోందని, అతనేర్పాటు చేసుకున్న నెట్ వర్క్ ద్వారా ఉప్పందడంతో, ముందుజాగ్రత్తగా తన సీట్ నుండి ఇంకో సాధారణసీట్ కి ట్రాన్స్ఫర్ చేయించుకుని, మళ్ళీ సద్దుమణిగాక ఇంకో ఆర్జన సీటుకి మారడం అతనికి 'డబ్బుతోపెట్టిన విద్య'. ఎందుకంటే ప్రభుత్వాఫీసుల్లో ఏపనైనా 'డబ్బుతోకొడితే' టక్కున అయిపోతుంది. ఎవరికైనా కావాల్సిన చోటికి ట్రాన్స్ ఫర్ కావాలన్నా, వచ్చిన ట్రాన్స్ ఫర్ ఆపేసుకోవాలన్నా, ప్రమోషన్ల పైరవీకి...ఇలాదేనికైనా ఇంతరేటు అని నిర్ణయమై ఉంటుంది. ఆ చిట్కాని తన ఆఫీస్ లో స్టాఫ్ బదిలీల విషయంలో కూడా ఉపయోగిస్తాడు అర్జునరావు. అప్పుడప్పుడు ఎవరో ఒక క్లర్క్ ని పిలిచి, 'నీ అవసరం ఫలానాచోట ఉందోయ్. నిన్నక్కడికి ట్రాన్స్ఫర్ చేస్తున్నా' అనంటాడు. ఆ క్లర్క్ లబోదిబోమని గోలపెట్టి, పిల్లల

చదువులు డిస్టర్బవుతాయనో, మంచానపడ్డ తల్లో, తండ్రో ఉన్నారు, వాళ్ళని కదపలేననో కాళ్ళావేళ్ళాపడతాడు. చివరికి తన పియే ద్వారా రాయబారం నడిపి అతని అక్కడే కనికరించి ఉంచడానికి ఇంత అని తీసుకుంటాడు.

మొన్న మున్సిపల్ ఆఫీస్ లో సూపరింటెండెంట్ 'నాకేంవద్దు గాని మిగతా వారికివ్వండి' అన్నతీరులోనే, తనకి బాగా పరిచయస్తులు, బంధువులైనా సరే తన ఆఫీస్ కి ఏదన్నా పనిమీద వస్తే, 'నాకేం వద్దు గానీ మా వెధవలూరుకోరు అందుకని వాళ్ళ కోసం మా అటెండెంట్ చేతిలో ఎంతోకొంత పెట్టి పొండి, మరీ ఎక్కువేం వద్దు సుమా!' అని సలహా ఇచ్చి, ఆ వచ్చినదాన్ని కూడా లాభంలో నష్టం అనుకుంటూ, తన వంతు కూడా తీస్కొందే వదలని తత్వం అర్జునరావుది.

************

అయితే యధా బాసు తధా స్టాఫ్ అన్నట్టు బాసే అలాఉంటే మనకేం అని ఆ ఆఫీస్ లో స్టాఫ్ కూడా బాగా సంపాదనకి అలవాటుపడి, కీలకమైన సీట్లలో ఉన్నవారు చివరికి తమకొలిగ్స్ కూడా వాళ్ళ ప్రావిడెంట్ ఫండ్ లోన్లు, మెడికల్ బిల్స్, ఏవైనా అరియర్స్, చివరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ వంటివి సెటిల్ చేసేటప్పుడు, పేమెంట్ చేసేటప్పుడు ఇంత పెర్సెంటేజ్ అని సమర్పించుకుంటేనే గానీ పని చెయ్యని స్థితికి చేరుకున్నారు. అందువల్ల ఆయా సీట్లకి డిమాండ్ ఉండేది. యూనియన్లతో ఒప్పందంవల్ల అలా డబ్బులొచ్చే సీట్లని మూడేళ్ళకోసారి రొటేషన్ పెట్టి, అందరూ ఆ "ఫలాలని" అనుభవించసాగారు. ఇందులో మళ్ళీ ఆ సీట్ కి వచ్చినవాడు, రాగానే ప్రత్యేక కృతజ్ఞత క్రింద అర్జునరావుకి "ఫలసాగు" అందించాల్సిందే. 'పులి పిల్లల్ని పెట్టిన వెంటనే తన పిల్లల్ని తానే తినేస్తుందంటారు!' అనేదెంతవరకు నిజమోగానీ, ఇక్కడ అర్జునరావు, అతని స్టాఫ్ సాధారణజనం నుంచి వసూలుచేసేదే కాకుండా, పులి చందాన తమసాటి ఉద్యోగులనుండీ కూడా తినగలిగినంత తినడానికి అలవాటు పడిపోయారు.

'అవినీతిని అంతం చేసేస్తాం! చేస్తున్నాం!! చేసేసాం!!!' అని ప్రభుత్వం వీలు దొరికినప్పుడల్లా ఘోష పెడుతున్నా.. రాజకీయ నాయకులు ఎల్లప్పుడూ వాడే "చట్టం తనపని తాను చేసుకుపోతుందనే" ఊతపదంలా, "కానూన్ కే హాథ్ బహుత్ లంబే" అన్న హిందీ సినిమాల్లో డైలాగ్ లా, ఉగ్రవాదులు తమపని, దొంగలు తమపని, లంచగొండ్లు తమపని తమ తమ షెడ్యూళ్ళ ప్రకారం సుదీర్ఘ కాలాల పాటు చేసుకుపోతూనే ఉన్నారు.

పేపర్లలో "అనిశా వలలో ఫలానాఅధికారి! కోట్లాదిఆస్తులస్వాధీనం" అని వార్తలు వచ్చినప్పుడల్లా, ఉగ్రవాదదాడుల్లో ఎక్కడైనా బాంబ్ బ్లాస్ట్ లు జరిగితే దేశమంతా రెడ్అలర్ట్ ప్రకటించి నాల్రోజుల తర్వాత సాధారణ జన జీవనం సాగినట్టు, అర్జునరావు అతని స్టాఫ్ కూడా కొన్నాళ్ళు జాగ్రత్తగాఉండి, సిన్సియర్ గా పనిచేసేసి, ఆపై మళ్ళీ తమ జూలు విదిల్చేవారు. అసలు పదిసార్లు "అవినీతి పనులు, అవినీతి పనులు" అని అంటూంటే, వినగా వినగా ఆ మాట "అవి 'నీతిపనులు' " అనేలాగా వినిపిస్తుంది. అలాగే అర్జునరావు హయాం లో ఆ ఆఫీస్ లో అవి 'నీతి పనులు' నిరాటంకంగా సాగిపోతూనే ఉన్నాయి.

**********

అలా   ఆర్జనరావుగా పేరుపొంది, సంవృద్ధిగా ఆర్జించుకున్న అర్జునరావు ఏ గొడవాలేకుండా రిటైర్మెంట్ కి దగ్గరకొచ్చేశాడు. రిటైర్మెంట్ కి వారంరోజుల ముందునుండి ఆయన ఆఫీస్ లో సెక్షన్లవారీగా "పదవి విరమణ ఘనసన్మానాలు"జరిగాయతనికి. అతని సపోర్ట్ తో   బాగాసొమ్ముచేసుకున్నవారు భారీఎత్తున కానుకలతో ముంచెత్తారతన్ని. ఆ రోజే అతని రిటైర్మెంట్. లోకల్ పేపర్లలో అతని పదవి విరమణ శుభాకాంక్షల ప్రకటనలతో ముంచెత్తారు. ఉదయంనుండి అతని ఛాంబర్ పూలదండలు, బొకెలు, స్వీట్స్ పేకెట్స్, అనేక బహుమానాల్తో నిండిపోయింది. మధ్యాహ్నం ఓ స్టార్ హోటల్ లో భారీఎత్తున పదవీవిరమణ సన్మానసభ, అందరికీ లంచ్ ఏర్పాటు చేసారు స్టాఫ్ అంతా కల్సి, సెక్షన్ వారీ గా విడివిడిగా అంతకు ముందు సన్మానించినాగాని.

కొసమెరుపుగా, ఆరోజు సాయంకాలం నాలుగున్నరకి వచ్చిన ఫాక్స్ మెసేజ అర్జునరావుని కుప్పకూలిపోయేలా చేసింది. "అది అతను ఓమూడేళ్లక్రితం జరిపిన ఒక టెండర్ లావాదేవీల్లో జరిగిన అవకతకలపై అతన్ని బాధ్యుణ్ణి చేస్తూ, సస్పెన్షన్, డిపార్ట్మెంటల్ ఎంక్వైరీకి వచ్చిన ఉత్తర్వు." అసలా అభియోగం వచ్చిన నాటినుండి దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొంటూ, ఎవరెవరికి ఏమేం ముట్టజెప్పాలో ముట్టజెప్తూ దాన్ని ఎక్కడికక్కడ నొక్కిపెడుతూ వచ్చాడు. చివరిరోజుల్లో దాని ఊసు ఎక్కడాలేకపోయేసరికి ఇంకఫర్లేదు, ఇంకో వారంరోజుల్లో రిటైరైపోతున్నాగా అనుకున్నాడు.

సీతాదేవిని అపహరిస్తే రావణుడికి వెంటనే ఏంజరగలేదు! ద్రౌపదీ వస్త్రాపహరణం గావించిన కౌరవులకీ వెంటనే ఏమీ జరగలేదు. ఆతర్వాత జరిగినయుద్ధాల్లో తగినశిక్షనుభవించారు వారు. అలాగ్గా, సర్వీస్ లో ఉన్నంతకాలం బాగా దోచుకున్న అర్జునరావు, ఉద్యోగం చివరిరోజునాడు,   వేడుకగా ధూమ్..ధాం అంటూ అట్టహాసంగా ఉద్యోగుల అభినందనలమధ్య ఇల్లు చేరాల్సినవాడు, అంబులెన్స్ లో హాస్పిటల్ కి తీసుకుపోబడ్డాడు.

పూర్వం 'కురుక్షేత్రం' నాటకంలో ఒకటోకృష్ణుడి స్థానంలో రెండోకృష్ణుడు వచ్చినట్టు, అర్జునరావు స్థానంలో ఇంకో అర్జునరావు ప్రతిరూపంలాంటి అధికారి మర్నాడు ఛార్జితీసుకున్నాడు. అలా ఛార్జి తీసుకుంటూనే,   ఆ ఛాంబర్ని పరీక్షగా చూసి, "ఈ ఛాంబర్ వాస్తు సరిగాలేదయ్యా! అందుకే అర్జునరావు అలా దొరికిపోయాడు. వెంటనే మన సివిల్ ఇంజనీర్ని పిలిపించండి, కొన్ని మార్పులు చేయాలి ఛాంబర్లో" అని హుకుం జారీ చేశాడు, తన పియేకి.

"మళ్ళీ కథ మొదలు, ఇప్పుడీ వాస్తుపేరుతో బోణీచేస్తున్నాడు ఈయనవంతు మింగుడుకి",   అననుకుంటూ పియే ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు, సివిల్ ఇంజనీర్ని రమ్మని చెప్పడానికి.




మల్లేశ్వరంలో పనిచేసే మిరియాలు అనేవాడికి పాండ్రాకకు బదిలీ అయింది.

పాండ్రాక నాలుగు కిలోమీటర్ల దూరమే కావడం చేతనూ,మల్లేశ్వరంలో తాతలనాటి సొంతిల్లు ఉన్న కారణం చేతనూ అతను రోజూ పాండ్రాక వెళ్ళిరావడానికి నిశ్చయించుకున్నాడు.

మిరియాలు నిరుపేద.ఉద్యోగం వచ్చిన కొత్త.సొంత సైకిల్ కూడా లేనందువల్ల పాండ్రాక నడిచి వెళ్ళి రాసాగాడు.ఉదయాన్నే బయలుదేరడం, ఎండ పెరగకమునుపే కార్యాలయానికి చేరుకోవడం,మళ్ళీ సాయంత్రం రావడం...రోజులు ఇలా గడిచిపోతున్నాయి.

ఒక రోజు మిరియాలుకు బాగా నీరసంగా ఉన్నది.సగం దూరం వెళ్ళి ఇక నడవలేక దారి పక్కన ఒక వేపచెట్టు కింద కూలబడ్డాడు. "ఎవరైనా వాళ్ళ సైకిల్ ఆపి ఎక్కించుకుంటే బాగుండు.ఏంటో చాలా నీరసంగా ఉంది." అనుకున్నాడు తనలో తానే.ఆ చెట్టు మీద ఉన్న వనదేవతకు ఆ మాటలు విని జాలి కలిగింది.దీవించింది.

వెంటనే అటుగా వెళ్ళే సైకిలతను సైకిలాపి మిరియాలుని రమ్మని ఎక్కించుకుని వెళ్ళాడు.కోరినదే తడవుగా ఇలా జరగడం భలే తమాషాగా తోచింది మిరియాలుకి."ఇలా రోజూ ఎవరైనా సైకిలెక్కించుకుంటే ఎంత హాయిగా ఉంటుందో!" అనుకుంటూ సైకిలెక్కాడు.

వన దేవత దీవెన ఫలితంగా ప్రతిరోజూ ఎవరో ఒకరు సైకిలాపి మిరియాలుని ఎక్కమని అడగసాగారు.అతనికి ప్రాణానికి సుఖంగా ఉన్నప్పటికీ ఆశ్చర్యం చేత భార్యకు విషయం చెప్పాడు.

వెంటనే ఆమె "ఏడ్చినట్లుంది తెలివి.ఆ చెట్టు మీద దేవతో దెయ్యమో ఉండుంటుంది.ఆ అడిగేదేదో సొంత సైకిలడగక వాళ్ళనీ వీళ్ళనీ ఎక్కించుకోమనడం ఎందుకూ!" అన్నది.

మిరియాలు ఇదేదో బాగున్నదని మరునాడు ఆ వేపచెట్టు కింద నుంచుని సొంత సైకిల్ ఉంటే బాగుణ్ణన్నాడు.వెంటనే అతడి కళ్ళముందు తళతళలాడే కొత్త సైకిల్ ప్రత్యక్షమైంది.

కానీ రెండ్రోజులు గడవకముందే భార్య "కారు అడగండి.దర్జాగా తిరగొచ్చు.మా పుట్టింటికి వేసుకెళ్తే ఎంత గొప్ప!" అన్నది."కానీ పెట్రోలు పోయించే స్తోమత మనకెక్కడిదీ?" అన్నాడు మిరియాలు నీరసంగా.

కాసేపు ఆలోచించాక భార్య "ఓ పని చేయండి.నీళ్ళతో నడిచే కారు అడగండి.కారునే సృష్టించిన దేవత అది నీళ్ళతో నడిచేలా చేయలేదంటారా?" అన్నది.

మిరియాలు ఎగిరి గంతేశాడు.మర్నాడే వెళ్ళి నీళ్ళతో నడిచే కారు తెచ్చుకున్నాడు.ఇక పని ఉన్నా లేకపోయినా బజార్లు తిరగసాగాడు.

మిరియాలుకి అడపాదడపా అప్పులిచ్చే వడ్డీ వ్యాపారి ఈ వైభోగం చూసి ఆశ్చర్యపడ్డాడు.తన బాకీ వసూలు చేసుకుందామని బయలుదేరి వాళ్ళింటికి కి వస్తుండగా మాటలు వినబడసాగాయి.

"నీళ్ళతో నడిచే కారు ఇమ్మని కోరడం ఎంత మంచి ఆలోచనో చూశారా! మరి నన్ను మెచ్చుకోరేం?" అంటొంది మిరియాలు

భార్య.

అప్పటిదాకా వడ్డీవ్యాపారి ఆ కారు నీళ్ళతో నడిచేదని ఎరగడు.వెంటనే తన బాకీ కింద ఆ కారుని జమ వేసుకుని కారుతాళాలు లాగేసుకున్నాడు.

మళ్ళీ వెళ్ళి చెట్టు కింద నుంచుని ఇంకో కారు కావాలన్నాడు మిరియాలు."అవసరం కోసం ఇస్తే విలాసాలకు పోయావు.అత్యాశాపరులకు నా సాయం ఉండదు" అనే మాటలు వినబడ్డాయి.

లబోదిబోమన్నాడు మిరియాలు."బుద్ధొచ్చింది తల్లీ! ఇంకెప్పుడూ తాహతు మీరి నడుచుకోను.ఏదీ అయాచితంగా ఆశించను కూడా.కాని ఈ ఒక్క కోరిక తీర్చు తల్లీ!ఆ కారును మాయం చెయ్."అన్నాడు మిరియాలు.

వ్యాపారి దగ్గర కారు మాయమైంది.వాడు మళ్ళీ బాకీ వసూలుకు వచ్చి కూర్చున్నాక కానీ తన పొరపాటు తెలిసి రాలేదు మిరియాలుకి. "అత్యాశ,అసూయ రెండూ అనర్థదాయకాలే." అని అనుభవపూర్వకంగా గ్రహించాడు.



చదువుతున్న పుస్తకం లో నుంచి తలెత్తి వేళ్ళు విరుచుకుంటూ ఉంటే ఎదురుగా లలిత విచారంగా కూర్చొని కనిపించింది వసుధకు. వసుధ లలిత చేతిని తట్టి ఏమిటి సంగతి అనట్లు సైగ చేసింది. లలిత ఉలిక్కి పడి బయటకు వెళుదాం అన్నట్లు లేచింది. వసుధ తన పుస్తకాన్ని రాక్ లో పెట్టి లలిత ను అనుసరించింది.లెక్చర్ జాబ్ నుంచి రిటైర్ అయ్యాక ,ఇంట్లో పనంతా ముగిసాక మధ్యాహ్నం లైబ్రరీ లో గడపటం అలవాటు చేసుకుంది వసుధ. లలిత తో అక్కడే లైబ్రరీ లో స్నేహం కలిసింది. ఇద్దరికీ పుస్తకాలు చదవటం ఇష్టం. దానితో లైబ్రరీ లో చదవటం అయ్యాక , ఇంకో పుస్తకం ఇంటికోసం తీసుకొని , లైబ్రరీ ఆవరణలోని చెట్టు కింద కూర్చొని,కాసేపు పుస్తకాల గురించి చర్చించుకోవటం ఇద్దరికీ అలవాటు. చాలా అరుదుగా సొంత విషయాలు మాట్లాడుకుంటారు.ఇది గత కొద్ది కాలంగా సాగుతోంది.ఇద్దరూ పున్నాగ చెట్టుకింద , బెంచ్ మీద కూర్చున్నారు.అప్పుడప్పుడు చెట్టు మీద నుంచి పున్నాగపూలు రాలుతున్నాయి.వాటి సువాసన సన్నగా గాలిలో తేలి వస్తూ, చుట్టూ ఉన్న చెట్ల నుంచి గాలి వీస్తూ, పరిసరాలు చాలా ఆహ్లాదంగా ఉన్నాయి.కాసేపు ఇద్దరూ నిశబ్దంగా కూర్చున్నారు.చివరకు,

"నన్ను కూడా గమనించ కుండా అలా మూడీ గా కూర్చున్నావు, ఏమిటి సంగతి?"అని అడిగింది వసుధ."నీకు తెలుసుగా వసూ, నాకు ఒక్కడే కొడుకని , వాడి మధ్య సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పెద్ద కంపెనీలో మంచి సాలరీ తో చేరాడని,వాడి కి పెళ్ళి సంబంధాలు చూస్తున్నామని." అని ఆగింది లలిత.

"ఊ తెలుసు ఏదైనా మంచి సంబంధం వచ్చిందా?" అడిగింది వసుధ.

"సంబంధాలకేమి బోల్డు వస్తున్నాయి.వాడే నా నెత్తిన నిప్పులు పోసాడు."కోపంగా జవాబిచ్చింది లలిత.

"ఏమిటీ ఎవరినైనా ప్రేమించాడా?ఈ మధ్య ఇది మామూలైపోయింది కదా దానికి విచారమెందుకు " అంది వసుధ.

"మామూలు ప్రేమైతే విచారమెందుకు?"చికాకుగా అంది లలిత.

"మరి కులాంతరమా ? ఖండాంతరమా ? ఖండాంతరం కూడా ఈ మధ్య ఎక్కువగానే జరుగుతున్నాయిగా." అంది వసుధ.

"అదైనా బాగానే వుండు. ఎలాగో అడ్జెస్ట్ అయ్యేవాళ్ళం. ఇద్దరు పిల్లలున్న విధవరాలును పెళ్ళి చేసుకుంటాడుట.వీడికేమైనా

కాలొంకరా ? కన్నొంకరా? అందగాడు, పెద్ద ఉద్యోగస్తుడు.ఒక్కగానొక్క కొడుకు.ఆమెనే పెళ్ళి చేసుకుంటాడుట. లేకపోతే అసలు పెళ్ళే చేసుకోడుట. ఇదేమి పోయేకాలమో! ఆ పిల్ల ఎవరో బాగానే బుట్టలో వేసుకుంది."కసిగా కన్నీళ్ళతో అంది లలిత.

లలిత వైపు సాలోచనగా చూస్తూ " ఏమిటట, ఆ అమ్మాయిని ఉద్ధరిస్తాడటనా ?"అడిగింది వసుధ.

"కాదుట , ప్రేమట. అదేమి ప్రేమో మరి ." కోపంగా అంది లలిత.

"ఓ" నిశబ్దంగా ఆలోచనలో పడింది వసుధ.ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు.

"నేను చెప్పేది నమ్మలేకపోతున్నావా వసూ మాట్లాడటం లేదు."అడిగింది లలిత. దానికి జవాబివ్వకుండా, నేనొకటి చెపుతాను వింటావా లలితా అడిగింది వసుధ.

"ఊ చెప్పు ."అనాసక్తిగా అంది లలిత.

* * * * * * * *

"బామ్మగారూ"అని పిలుస్తూ లోపలికి వచ్చిన వసుధ కు వంట ఇంటి గడపమీద కూర్చున్న యువకుడు కనిపించాడు.కొద్దిగా నల్లగా మోటుగా ఉన్నాడు.లైట్ క్రీం కలర్ పైజామా, కుర్తావేసుకొని ఉన్నాడు.

అతను వసుధ పిలుపు కు తలేత్తి చూసాడు.చామనచాయ, కోల మొహం,పెద్ద కళ్ళు , చిలకాకుపచ్చకు ఎర్ర అంచున్న పరికిణీకి, చిలకాకుపచ్చ జాకెట్టూ,ఎర్రవోణీ వేసుకున్న ఓ అమ్మాయి , చేతిలో ఓ గిన్నె తో చిలకలా నిలబడి కనిపించింది. నిస్సంకోచం గా తనను నిలువెల్లా పరీక్షగా చూస్తున్న అతనిని చూసి కొద్దిగా బిడియంగా కదిలింది వసుధ.

ఇంతలో తులసికోట దగ్గర , పిడకలమీద పాలు పొంగిస్తూ మాఘపాదివారం పాట పాడుకుంటున్న విఘ్నేశ్వరమ్మ వసుధను చూసి"రామ్మా వసూ. వీడు నా మనవడు వివేక్.యుద్ధ విమానాలను తోలుతాడని చెప్పానే వాడే వీడు"అంది.

"అబ్బ ఏమిటమ్మమ్మా, ఎడ్ల బండిని తోలుతానన్నట్లు చెపుతావు."కొద్దిగా కినుకగా అన్నాడు వివేక్. అతను అన్న విధానానికి పక్కున నవ్వింది వసు. విఘ్నేశ్వరమ్మ కూడా నవ్వి,"ఏదోలేరా, ఈ అమ్మాయి వసుధ.యం.ఏ చదువుతోంది. ఈ మధ్యనే మన పక్క వాటాలోకి వచ్చిన హెడ్మాస్టర్ గారి అమ్మాయి."అని పరిచయం చేసి,"మీఅమ్మ పాలు పొంగించటం అప్పుడే పూర్తి చేసిందా ప్రసాదం తెచ్చావు ."అని వసుధతో అంది.

"ఇందండి" అని ప్రసాదం గిన్నె అక్కడ పెట్టి వెళ్ళిపోయింది వసుధ.వసుధ వెళ్ళిన వైపే చూస్తున్న మనవడి తో "ఏం రా అమ్మాయి ఎలా ఉంది? మాట్లాడనా?"నవ్వుతూ అడిగింది విఘ్నేశ్వరమ్మ.

"అబ్బా అమ్మమ్మా ఎన్ని సార్లు చెప్పాను, నేను పెళ్ళి చేసుకోనని. నా ఉద్యోగానికి పెళ్ళి చేసుకొని ఇంకో అమ్మాయిని బలి ఇవ్వలేను."విసుగ్గా అన్నాడు వివేక్ కాని గొంతు కొంచం బలహీనం గానే ఉంది.

"ఏమైందిరా నీ ఉద్యోగానికి ? దేశానికి సేవచేస్తున్న వీర జవానువి.పల్లెటూరి అమ్మాయి ఐనా చదువుకుంటోంది. తెలివైంది. కాస్తో కూస్తో అందమైంది. మనకు తెలిసిన కుటుంబలోని అమ్మాయి. అడుగుతాను."అంది విఘ్నేశ్వరమ్మ.

"నా ఉద్యోగం సంగతి చెప్పు. తల్లి తండ్రులకూ, ఆ అమ్మాయికి అభ్యంతరం లేకపోతే, అమ్మకూ నాన్నకూ మీకూ అందరికీ నచ్చితే నాకు ఓకేనే."నవ్వుతూ అన్నాడు వివేక్.

ఈ మాటలన్నీ అటు వైపు గోడ పక్కన ఉన్న వసుధకు వినిపిస్తూనే ఉన్నాయి. ఓసారి వివేక్ రూపంను గుర్తు తెచ్చుకుంది. కొద్దిగా మోటుగా ఉన్నా బాగానే ఉన్నాడు.బహుషా బార్డర్ లో తిరుగుతూ ఉండటం వల్ల చలికి మోటు తేలి ఉంటాడు అనుకుంటూ ఉంటే బుగ్గల్లోకి వెచ్చని ఆవిరి వచ్చింది.

"అక్కా అక్కా "అరుచుకుంటూ వచ్చిన విహారి అరుపు తో ఈ లోకంలోకి వచ్చి,"ఏమిటిరా?" అని అడిగింది.

"అక్కా పొద్దున పక్కింటి మామ్మగారి మనవడు వచ్చాడు. అతను ఫైటర్ పైలెట్ తెలుసా? నేను ఇప్పుడే మాట్లాడి వస్తున్నాను. మిలిటరీ లో చేరాలంటే యన్. డి. యే అని ఉంటుందిట. అక్కడ సెలెక్ట్ అయ్యి , కోర్స్ చేస్తే డైరెక్ట్ గా మిలిటరీ ఆఫీసర్

అవ్వొచ్చుట. నాకా వివరాలన్నీ చెపుతానన్నారు. పరీక్ష వ్రాసేందుకు సహాయం చేస్తానన్నారు."ఆరాధనగా అన్నాడు విహారి.వాడికి ఎప్పటి నుంచో మిలిటరీ లో చేరాలని ఆశ. వాడి కోరిక తీరే దారి కనిపించిందని సంబర పడిపోతున్నాడు.

వసుధ తల్లి తండ్రులు విశ్వేశ్వరరావు గారు, విశాలమ్మగారి తో విఘ్నేశ్వరమ్మ తన మనవడి సంగతి చెప్పింది.ముందుగా అతని ఉద్యోగం గురించి ఆలోచించారు వారు. కాని వసుధ "ప్రమాదం అన్నది ఎక్కడైనా జరగవచ్చు . యుద్ధం లోనే జరగాలని లేదు. నాకు ఇష్టమే"అనటం తో వారి పెళ్ళి కి ఒప్పుకున్నారు.వివేక్ తల్లి తండ్రి వినోదారావు,విమలమ్మ ఇన్నాళ్ళకు మంచి అమ్మాయి తో కొడుకు పెళ్ళి కి ఒప్పుకోవటం తో తమ కోరిక తీరుతున్నందుకు ఉప్పొంగిపోయారు.అందరి ఆమోదం తో వివేక్, వసుధ ల పెళ్ళి వైభోగంగా జరిగిపోయింది.

ఇన్ని సంవత్సరాలుగా ఫీల్డ్ పోస్టింగ్ లో ఉండటము తో ఫామిలీ స్టేషన్ కు పోస్టింగ్ వచ్చి,కుటుంబాన్ని తీసుకెళ్ళేందుకు పర్మిషన్ వచ్చింది. ఇల్లు దొరికింది.వెంటనే వసుధను తీసుకెళ్ళాడు వివేక్. వసుధకు మిలిటరీ జీవితం కొత్తైనా వివేక్ సహాయం తో అక్కడ అలవాటుపడుతోంది. చుట్టు పక్కల ఆఫీసర్ ల భార్యల తో పరిచయం చేసుకుంది. ముఖ్యంగా వివేక్ చిన్న నాటి నుంచి స్నేహితుడు, ప్రస్తుతం సహోద్యోగి ఐన వాల్మీకి చాలా దగ్గరయ్యాడు. నువ్వు నాకంటే చిన్నదానివి, స్నేహితుడి భార్య వు నిన్ను అందరిలా మిసెస్ వివేక్ అనో,బాబీ అనో పిలవను, వసూ అనే పిలుస్తాను అని పరిచయమైన మొదటిరోజే చెప్పేసాడు.

"నువు పెళ్ళి చేసుకో నాకు తోడు వస్తుంది."అనేది వసు. వాల్మీకి నవ్వి ఊరుకునేవాడు. ఎక్కడికెళ్ళినా ముగ్గురూ కలిసే వెళ్ళే వాళ్ళు. ఆనందంగా సాగుతున్న వారి జీవిత నౌక లోకి బబ్లూ విపుల్ వచ్చి చేరాడు. బబ్లూ వచ్చిన ఏడాదిన్నరకే బబ్లీ విజిత వచ్చేసింది. బబ్లీ వచ్చిన ఆరునెలలకు , ఇక్కడకు వచ్చి మూడేళ్ళవుతోంది ఇహ పోస్టింగ్ రావచ్చు అనుకుంటూ ఉండగా బంగ్లాదేశ్ వార్ వచ్చింది.కాంప్ లో ఉన్నవారంతా యుద్దానికి వెళ్ళారు.అప్పుడే యన్.డి.యే లో కోర్స్ ముగించుకొని జాయింగ్ కోసం సెలవల్లో ఉన్న విహారి అక్క దగ్గరకు సహాయంగా వచ్చాడు.

అంతటా యుద్ద వాతావరణం కనిపిస్తోంది. కాంప్ లో అందరూ గంభీరంగా ఉన్నారు. అప్పుడప్పుడు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడే వార్త వినవలసి వస్తుందో నని అంతా గుండె గుప్పెట్లో పెట్టుకొని బిక్కు బిక్కు మంటున్నారు. అన్ని కుటుంబాల ఆడవాళ్ళు ఒకరికొకరు తోడుగా ఉంటున్నారు.వంటరిగా ఉండలేని కొత్తగా పెళ్ళైన వాళ్ళు పుట్టింటి కి వెళ్ళిపోయారు.అంతటా నిశబ్ధంగా , అప్పుడపుడు పిల్లల కేకలతో ఉంటోంది కాంప్. అందరిని పలకరిస్తూ, అందరి తో కలివిడిగా తిరుగుతోంది వసుధ.ఎవరికేమి కావాలో అడిగి తెలుసుకుంటోంది. ఏయిర్ మెన్ ల భార్యల దగ్గరకు వెళ్ళి వాళ్ళకు ధైర్యం చెపుతోంది.కాంప్ అంతా ఒక్కతై తిరుగుతూ అందరిని కలుపుకుంటూ తన భయాన్ని మర్చిపోగలుగుతోంది.ధైర్యంగా ఉంటోంది.ఏ ఏయిర్ మెన్ ఐనా చనిపోయాడని వార్త వస్తే , అతని భార్య ను ఓదార్చి, వాళ్ళ వాళ్ళకు తెలిపి ,ఆమెను ఇంటికి పంపే ప్రయత్నం చేస్తున్నది.వసుధను చూసి మిగిలా ఆఫీసర్ ల భార్యలు కూడా వాళ్ళ వాళ్ళ యూనిట్ జవాన్ల భార్యలకు అండగా నిలబడుతున్నారు.కాంప్ అంతా భయం భయంగా శ్మశాన నిశబ్దం తో ఉంది. అందరూ ఎపుడే వార్త వినవలసి వస్తుందో అని

భయపడుతున్నారు. ఇంతలో యుద్ధం ముగిసింది అని వార్త వచ్చింది.అందరూ ఊపిరి పీల్చుకొని తమవారికోసం ఎదురు చూస్తున్నారు.

వివేక్ కోసం ఎదురు చూస్తున్న వసు నెత్తిన పిడుగు పడింది. వాల్మీకి విచారం గా వివేక్ యూనిఫాం తెచ్చి వసు చేతిలో పెట్టి నిలబడ్డాడు.ఒక్క క్షణం ఏమి జరిగిందో తెలిలేదు వసుకు. అర్ధం కాగానే యూనిఫాం చేతిలో పట్టుకొని గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.యూనిఫాం ను అరచేతుల్లోకి తీసుకొని అందులో మొహం దాచుకుంది. తను కాపురానికి వచ్చిన మొదటి రోజున యూనిఫాం వేసుకొని వచ్చి స్మార్ట్ గా సెల్యూట్ చేసిన వివేక్ కనిపించాడు.ధుఃఖం పొంగుకొచ్చింది.అలా ఎంతసేపు రోదిస్తూ ఉండిపోయిందో తెలిదు. బయట నుంచి విపుల్, విజితల ఏడుపు వినిపించింది.వాల్మీకి, విహారీ తలుపు కొడుతున్నారు.శోకదేవతలా ఉన్న తలుపు తీసిన వసును చూసి ఇద్దరూ బోరుమన్నారు.తమను తాము నిలవరించుకున్నారు.బబ్లూ, బబ్లీలను వసుకు అందించాడు విహారి. నీకు నేను సపోర్ట్ గా ఉంటాను అన్నట్లు అక్క పక్కన నిలబడ్డాడు.తమ్ముడి భుజం ఆసరాగా చేసుకొని నిలబడ్డది వసుధ.

కాలం ఎవరికోసమూ ఆగదు.ఎవరి సుఖ దుఃఖాల తో దానికి పనిలేదు.అలా సాగిపోతూనే ఉంటుంది.ఎంత తమ్ముడు ఆదరంగా చూసుకుంటున్నా ఎంత కాలమని వాడి మీద ఆధారపడాలి?ఓరోజు వాడికీ పెళ్ళవుతుంది, వాడి కుటుంబము నుఅమ్మానాన్నలను చూసుకోవాలి. ప్రస్తుతము పెళ్ళి కాలేదు కాబట్టి క్వాటర్ దొరకదు. బయట ఇల్లు తీసుకోవాలి అన్నీ సమస్యలే! తనను తాను నిలవరించుకొని హైదరాబాద్ వచ్చేసింది. కాలేజ్ లో లెక్చరర్ గా చేరి అమ్మానాన్నలను దగ్గర పెట్టుకొంది వసుధ.

వాల్మీకిది షార్ట్ సర్వీస్ కమీషన్ కావటం వల్ల యుద్ధం కాగానే మిలిట్రీ నుంచి రిటైరై హైదరాబాద్ వచ్చి వేరే ఉద్యోగం లో చేరాడు. ఇంక ఇంటిపట్టునే ఉంటున్నావు కదా పెళ్ళిచేసుకోమని సంబంధాలను తేసాగారు తల్లి తండ్రులు.ఎన్ని సంబంధాలు వచ్చినా తన మనసులో ఉన్న అమ్మాయిలా ఎవరూ కనిపించలేదు.అందుకని పెళ్ళిని వాయిదావేస్తూ వచ్చాడు. ప్రతి రోజూ సాయంకాలము, వాల్మీకి వసుధను చూసేందుకు వసుధ ఇంటికి వచ్చేవాడు. కాసేపు వసుధ తో కబుర్లు చెప్పి, వంట్లో బాగాలేని విశ్వేశ్వరయ్య గారితో కాసేపు గడిపి, పిల్లలతో కొద్దిసేపు ఆడుకొని వెళ్ళటం అలవాటు చేసుకున్నాడు.వసుధ వంటరిగా పరిస్తితులను ధైర్యం గా ఎదుర్కోవటము,యుద్ధ సమయం లో కాంప్ లో చూపిన చొరవ,పెద్దలకు గౌరవమిచ్చి ఓపిక గా వారికి సేవచేయటము చూసిన వాల్మీకి కి వసుధను వివాహము చేసుకోవాలని కోరిక కలిగింది. తనకున్న తల్లితండ్రుల బాధ్యతకు వసుధ తోడ్పాటు దొరుకుతుందని నమ్మకం కలిగింది.తను వెతికే అమ్మాయి వసుధలా ఉండాలనుకుంటున్నాడు కాబట్టే ఇప్పటి వరకూ ఎవరూ నచ్చలేదు అనుకున్నాడు.ఓరోజు సమయము చూసి వసుధ తో తన కోరికను తెలిపాడు.

ఒక్కసారి చుర్రుమన్నట్లు చూసింది వసుధ. "నన్ను ఉద్దరిద్దామనుకుంటున్నారా? నాకు ఎవరి ఆసరా అవసరం లేదు."విసురుగా ఉంది. "కాదు వసు. నిన్ను ఉద్దరించటం కాదు. నీ ఓపిక, తెలివితేటలు నాకు నచ్చాయి. నువ్వు ధైర్యంగా పరిస్తితులను

ఎదుర్కోవటం నచ్చింది. నీకు పెద్దలపట్ల ఉన్న గౌరవం నచ్చింది."అన్నాడు వాల్మీకి.

"అంటే ముందు నుంచి మీకు ఈ ఐడియా ఉందా?"కొద్దిగా కోపంగా అడిగింది.

"అయ్యో లేదు. ముందు నుంచి నువ్వు నాకు స్నేహితుడి భార్యవే.నేను నీ స్నేహితుడినే! నీకు తెలుసు కదా మా నాన్నకు పక్షవాతం. ఆయనను చూసుకోవాలి . మావదిన విసుర్లు వాళ్ళు తట్టుకోలేకపోతున్నారు.మా అన్నయ్య పట్టించుకోడు.నేను వాళ్ళను నాదగ్గరే ఉంచుకోవాలనుకుంటున్నాను. నీకు పెద్దల పట్ల ఉన్న గౌరవం, మీ నాన్నగారికి నువ్వు చేస్తున్న సేవ చూస్తుంటే మా అమ్మానాన్నలను కూడా చూసుకోగలవన్న ధైర్యం కలుగుతోంది.నన్నూ పెళ్ళి చేసుకోమని అమ్మా నాన్న అడుగుతున్నారు. కొంత మంది అమ్మాయిలను చూసారు.ఎవరూ నాకు కావలసినట్లుగా అనిపించలేదు. ఎవరో తెలినివాళ్ళను చేసుకోవటం కన్నా , తెలిసిన దానివి , నా అబిరుచికి, నా మనసుకు నచ్చినదానివి అని నిన్ను ప్రపోజ్ చేస్తున్నాను. నువ్వూ ఆలోచించుకో. మీ పెద్దవాళ్ళను , విహారి ని అడుగు. తొందరేమీ లేదు.బలవంతమూలేదు. నేను ఎప్పటికీ నీ స్నేహితుడినే. టేక్ యువర్ ఓన్ టైం."అనునయం గా అన్నాడు."నేను వివేక్ ను మర్చిపోలేను. రోజూ తలుచుకుంటాను"అంది వసుధ.

"ఎవరు మర్చిపోమన్నారు, నీతో పాటు నేనూ తలుచుకుంటాను "అన్నాడు వాల్మీకి.

"నాకు ఇంక పిల్లలు పుట్టరు." అంది వసుధ.

"పరవాలేదు , బబ్లూ, బబ్లీనే నా పిల్లలు. నువ్వే ఆలోచించుకో నా తరుపు నుంచి అంతా ఓకేనే."నవ్వుతూ అన్నాడు వాల్మీకి.

అంతటితో ఊరుకోలేదు వాల్మీకి, విహారి కి, విశ్వేశ్వరయ్య గారు, విశాలి గార్లకు కూడా తన నిర్ణయం చెప్పాడు. అందరికన్నా ముందు విఘ్నేశ్వరమ్మగారు మనవారాలిని ఒప్పుకోమని ఒత్తిడి చేసింది.అందరి బలవంతం తో కొంత, ఎదిగే పిల్లలకు తండ్రి అవసరమూ ఉందని కూడాను, కొంత ఇష్టం తోనూ పెళ్ళికి ఒప్పుకుంది వసుధ. ఆ తరువాతవాల్మీకి పెళ్ళి చేసుకున్నందుకు ఏ రోజూ చింతించలేదు.

పిల్లలకు వాల్మీకి అసలు తండ్రి కాదని ఎప్పుడూ ఊహలోకి కూడా రానియ్యలేదు వాల్మీకి. వసుధను, పిల్లలను అంత ప్రేమగా చూసుకున్నాడు.

ముగించింది వసుధ.

"అంటే ఇది నీ కథా ?"విస్మయంగా అడిగింది లలిత.

"అవును.డెబ్బైలల్లోనే నా ఈ పెళ్ళి జరిగింది.పూర్తిగా సాంప్రదాయ కుటుంబమైన మావాళ్ళు సంతోషం గా ఒప్పుకున్నారు.ఇప్పుడు ఇరవై ఒకటవ శతాబ్దం లో నువ్వు అభ్యంతర పెడుతున్నావు.ఇద్దరికీ ఇష్టమైతే, సమస్యలు ఏమీ లేకపోతే ఒప్పుకోవచ్చు. ఆలోచించుకో."అంది వసుధ.

"ఒక సంగతి అడగవచ్చా?"మొహమాటంగా అడిగింది లలిత.

" నీ అనుమానం ఏమిటో అడుగు."అంది వసుధ.

"మీ పిల్లలకు తెలుసా ?"అడిగింది లలిత.

"తెలుసు. కొంచం వాళ్ళకు జ్ఞానం వచ్చాక ఓరోజు ఇద్దరినీ కూర్చోబెట్టుకొని అన్ని సంగతులూ చెప్పాడు వాల్మీకి .వివేక్ గురించి కూడా చెప్పాడు.ఇద్దరికీ దేశం కోసం ప్రాణాలర్పించిన తండ్రి వివేక్ అంటే చాలా ఆరాధన,గౌరవం.చిన్నప్పుడే తమను అక్కున చేర్చుకొని, తండ్రి లేని లోటు తెలికుండా గారాబంగా పెంచిన డాడీ వాల్మీకీ అంటే అభిమానం.వివేక్ వర్ధంతి రోజున అందరం కలిసి శ్రద్ధాంజలి ఘటిస్తాము.ఆ రోజు పూర్తిగా వివేక్ తలపుల్లోనే ఉంటాము."అని చెప్పింది వసుధ

"తండ్రులిద్దరి ఆదర్శం తో విపుల్ కూడా ఫైటర్ పైలట్ గా చేరాడు. ఈ మధ్య కొద్ది సంవత్సరాలుగా మిలిట్రీ కొన్ని విభాగాలలో అమ్మాయిలను కూడా తీసుకుంటున్నారు కదా, విజిత కూడా ఈ.యం.ఈ విభాగం లో చేరింది." అని కొనసాగించింది.

ఇద్దరూ కొద్దిసేపు ఆలోచనల్లో ఉండిపోయారు. చిన్నగా చీకట్లు ముసురుకుంటున్నాయి.అంతటా నిశబ్దం గా ఉంది.పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.ఆలోచనల్లో నుంచి తేరుకొని కృతనిశ్చయం తో లేచింది లలిత.

"      మా అబ్బాయి తో మాట్లాడి, అసలు వాడి ఆలోచన ఏమిటో, ఆ అమ్మాయిని ఎందుకు పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాడో వివరంగా తెలుసుకొని,వాడిది సదభిప్రాయమైతే      ఈ పెళ్ళికి ఒప్పుకుంటాను."అంది లలిత.

"శుభం " అంటూ లలిత చేతి మీద చిన్నగా తట్టుతూ లేచింది వసుధ.




మా వదిన నన్ను పెద్ద చిక్కులోనే పడేసింది. అసలేం జరిగిందంటే పొద్దున్నే ఫోన్ చేసి, “స్వర్ణా, పదకొండుగంటలకల్లా రెడీగా వుండు.. మా పిన్ని కొడుకు..రాజీవ్ లేడూ..వాడి పెళ్ళిచూపులకెళ్ళాలి..” అంది.

ఎక్కడో ఉరిమితే ఇక్కడ అదిరినట్టు, మా వదినే నాకు స్వంత వదిన కాదాయె. పెద్దమ్మ కోడలు. అయినా చిన్నప్పట్నించి అన్నయ్యలో వున్న చనువు వల్లా, ఇద్దరం హైద్రాబాదులో వుండడమే కాకుండా ఫ్రెండ్సూరాకపోకలు కూడా బాగా వుండడం వల్లా వదిన నాకు మంచి స్నేహితురాలైంది. అంతమాత్రాన ఆవిడ పిన్ని కొడుకు పెళ్ళిచూపులకి నేను వెళ్ళడం యేమిటీ.. నేనేదైనా అనే లోపలే.. “కాదనకు స్వర్ణా, నేనూ, మా తమ్ముడూ, మీ అన్నయ్యే వెడుతున్నాం. ముగ్గురు వెళ్లకూడదు కదా.. అందుకని నాలుగోదానివిగా నువ్వు రావాలంతే..” అనేసింది.

నాకు మొహమాటంగా అనిపించింది. అసలే రోజులు మారిపోయాయి. ఇదివరకటి పెళ్ళికూతుళ్ళూకాదు, అప్పటి పెళ్ళిచూపులూ కాదు. ఎక్కడో వేలు విడిచిన బంధువు పెళ్ళిచూపులకి నేను వెళ్ళడమేవిటీ..చోద్యం కాకపోతే.. అందుకే అడిగాను "వాళ్ళ అమ్మానాన్నా రాలేదా వదినా.." అంటూ.

"లేదు. వాళ్లని మా తమ్ముడే రావొద్దన్నాడు. మా పిన్ని వస్తే పెళ్ళిచూపుల్లో ఆ అమ్మాయిని ఎక్కడ ఉప్మా చెయ్యమంటుందోనని వాడి భయం.." అంది. అదేవిటో.. ఈవదిన ఒక్కోసారి ఏవీ అర్ధంకాకుండా మాట్లాడుతుంది. పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతురు ఉప్మా చెయ్యడమేవిటి అనుకుంటూంటే తెలివైన వదిన నా అనుమానం కనిపెట్టేసింది. "ఓ.. నీకు తెలీదు కదూ! ఇదివరకు రోజుల్లో మావాళ్ళు ఎవరింటికి పెళ్ళిచూపులకి వెళ్ళినా ఆ అమ్మాయిని ఉప్మా చేసి తెమ్మనేవారు. ఎందుకంటే ఉప్మా చేసేముందు ఆ అమ్మాయి ఉప్మారవ్వ పురుగులు పట్టిందో లేదో అని పరీక్షగా చూస్తుందో చూడదోనని పరీక్ష పెట్టేవాళ్ళన్న మాట. అలా చూడకుండా ఉప్మా చేసి తెచ్చేస్తే ఆ అమ్మాయికి శుచి, శుభ్రం లేవని తీర్మానించేసుకుని ఆ సంబంధం వదిలేసుకునేవాళ్ళన్న మాట. మా పిన్ని కూడా మొన్న ఎవరింటికో పెళ్ళిచూపులకి వెళ్ళినప్పుడు అలాగే ఆ అమ్మాయిని కాస్త ఉప్మా చేసి తెమ్మందిట. అప్పటిలాగే ఇప్పుడూ అడుగుతారా ఎవరైనా.. రోజులు మారిపోలేదూ.. పాపం మా రాజీవ్ వాళ్ళ ముందు తలెత్తుకోలేకపోయేడుట. అందుకే ఇప్పుడు సంబంధం చూడ్డానికి మా పిన్నిని, బాబయ్యని వద్దని వాడొక్కడే వచ్చాడు. ఒక్కడే పెళ్ళిచూపులకి వెడితే పిల్లవాళ్లముందు చిన్నబోతామని మా పిన్ని నన్నూ, మీ అన్నయ్యని వెళ్ళమంది. అందుకే మేం ముగ్గురం కాకుండా నిన్నూ రమ్మంటున్నాను. నువ్వు కూడా నా పక్కన వున్నావనుకో.. ఆ పిల్ల సంగతులు ఒక్కొక్కళ్ళం ఒక్కొక్కటి కనిపెట్టొచ్చు" అంది.

నాకు ఎందుకో మొహమాటంగా అనిపించింది. ఆ రాజీవే వదినకి పిన్ని కొడుకు. ఆ వదినకు నేను పిన్నత్తగారి అమ్మాయిని. నీ ముక్కేదంటే ఏదో అన్నట్టు ఈ రోజుల్లో ఇంత దూరం చుట్టరికంతో యేమని వెడతాను పెళ్ళిచూపులకి.. అందుకే వదినతో అన్నాను.. "బాగుండదేమో వదినా, అయినా అన్నయ్య వస్తున్నాడుగా.. నువ్వూ, రాజీవ్ ముందెళ్ళి అన్నయ్యని ఒక అడుగు వెనకాల రమ్మను. ఇంక ముగ్గురన్న శంక వుండదు." నాకు తోచిన చక్కటి సలహా చెప్పేసేను.

"సరిలే..మీ అన్నయ్యని నమ్ముకుంటే ఇంతే సంగతులు. అయినా నీకు తెలీదా స్వర్ణా.. ఈ మొగుళ్ళున్నారే..వాళ్ళని వట్టి పసుపు విఘ్నేశ్వరుల్లాగ చూడాలంతే.. వారిని అంతవరకే వాడుకోవాలి.." అంది. "ఏంటొదినా..?" అన్నాను ఆశ్చర్యంగా. అసలు మొగుళ్ళు పసుపు విఘ్నేశ్వరులనే మాటే నేనెక్కడా వినలేదు మరి.

"అయ్యో.. నీకు తెలీదా? అంటే మరేంలేదు స్వర్ణా.. మనం పండగల్లో వ్రతాలు చేసేటప్పుడు ముందు పసుపు విఘ్నేశ్వరుణ్ణి చేసి తమలపాకులో పెట్టి, తొలిపూజ చేస్తాం కదా..ఆ తర్వాత ఓ చిన్న బెల్లమ్ముక్క నైవేద్యం పెట్టేసి, ఆయనని ఎత్తి పక్కన పెట్టేసి, శుభ్రంగా వ్రతం చేసుకుని, అష్టోత్తరాలూ, సహస్రాలూ చదువుకుని, ఆ దేవుడికి నవకాయ పిండివంటలతో మహా నైవేద్యం

పెట్టుకుంటాం. ఈ మొగుళ్ళూ అంతే.. ఎక్కడికెళ్ళాలన్నా మన పక్కన వాళ్ళు వుండాలి. అంతవరకే. తీరా ఎక్కడికైనా వెళ్ళాక వాళ్లని మాట్లాడనివ్వకూడదు. ఓ పక్కకి పెట్టెయ్యాలి. అంతే. ఆడవాళ్ల విషయాలు మనమే గ్రహించాలి. అందుకే నేను నిన్ను రమ్మంటున్నది." అంది. నాకు భయం ఇంకా ఎక్కువైంది.

ఈ రోజుల్లో ఆడపిల్లలు చదువులూ, ఉద్యోగాల్లోనే కాదు తెలివితేటల్లోనూ, నలుగురిలో మసలడం లోనూ కూడా మగపిల్లల్ని మించిపోయున్నారు. వాళ్లని పాతకాలంవాళ్ళం మేం కనిపెట్టడమేమిటీ.. మా రోజుల్లో అయితే వేరు.. లోపల ఎంత ఉక్రోషంగా వున్నా నాన్న తెచ్చిన సంబంధం ముందు తలొంచుకుని కూర్చుని, వాళ్ళు అడిగిన అడ్డమైన ప్రశ్నలకి సమాధానాలు చెప్పేవాళ్ళం. ఇప్పుడలా కాదే.. ఆడపిల్లలే ప్రశ్నలు వేస్తున్నారని ఎక్కడో విన్నాను కూడానూ..అందుకే వదినతో "అయినా ఈ రోజుల్లో కూడా పెళ్ళిచూపులేంటి వదినా అసహ్యంగా. వాళ్ళిద్దరినీ బైట ఏదైనా హోటల్లో మాట్లాడుకోమంటే సరి. ఒకరి అభిప్రాయాలు ఇంకోళ్ళు తెలుసుకుంటారు." అన్నాను.

వదినకి నామాటలు నచ్చినట్టులేదు. "స్వర్ణా, ఇంటికి పిల్లని తెచ్చుకునేటప్పుడు ఎన్ని చూసుకోవాలో తెలీదా? ఏ హోటల్‌కో వెళ్ళి నీకూ దోశే ఇష్టం, నాకూ దోశే ఇష్టం.. మన ఇద్దరి అభిరుచులూ ఒకటే అనుకుంటే సరిపోతుందా? అందులోనూ ఈ రోజుల్లో ఆడపిల్లలు చదువుతోపాటూ లోకజ్ఞానం కూడా నేర్చుకుని ఆవలించకుండానే పేగులు లెక్కెట్టేస్తున్నారు. మగవాళ్ళేమో ఆ ఒక్క చదువులోనే మునిగిపోయి నోట్లో వేలెట్టుకుని వెర్రివెధవల్లా తయారౌతున్నారు. పిల్లాణ్ణొక్కణ్ణీ అలా వదిలెయ్యొద్దని మా పిన్ని ఏడుస్తూ ఫోన్లో నా చేత ఒట్టు వేయించుకుంది. అందుకే నిన్నడుగుతున్నాను. మనిద్దరం ఒకళ్ళకొకళ్ళం వుంటే ఆ ఇంటి గురించీ, పిల్ల గురించి బోలెడు వివరాలు సేకరించి పిన్నికి చెప్పొచ్చు.." అంది.

నాకు గాభరా వేసింది. వదిన యేమనుకుంటే అనుకోనీ అని "అమ్మో, నేను రాను. నాకసలే మొహమాటం. మా తమ్ముడి పెళ్ళిచూపులకే నేను వెళ్ళలేదు. నాకు భయం కూడానూ.." అంటూ అర్థం లేకుండా గబగబా చెప్పేసేను. వదిన ఊరుకోలేదు.."అలాకాదు స్వర్ణా.. ముగ్గురం వెళ్ళడానికి శాస్త్రం ఒప్పదు కదా.. పోనీ, నీకు భయమైతే మీ అన్నయ్యలాగా ఓ పక్కన కూర్చో.. అంతే.. మిగిలినవి నేను చూసుకుంటానుగా..నువ్వు రాకపోతే మరింక నీతో మాట్లాడనంతే.. అయినా అవసరం పడి అడిగాను.. రేపొద్దున్న నీకేమీ అవసరం పడదా.. నేను రావద్దా.." అంటూ నిష్ఠూరాలాడేసి, అలాగే వస్తానని నాచేత ఒప్పించేసింది మా వదిన.

నేను భయపడుతూనే ఒప్పుకున్నాను కానీ ఖచ్చితంగా వదినకి చెప్పేసేను.. అక్కడ నన్నేమీ మాట్లాడమనొద్దు, ఉట్టినే లెక్కకి ఆటలో అరటిపండులా కూర్చుంటాను అంతే అని చెప్పేను. కానీ మా వదిన సంగతి నాకు తెలుసు. ఎక్కడ యే మాటల్లో నన్ను ఇరికించేస్తుందోనని గుండె దడదడలాడుతోంది. ఇహనో..ఇప్పుడో వచ్చేస్తుంది.. అనుకుంటూ ఈ చిక్కులోంచి మర్యాదగా బైట పడెయ్యి భగవంతుడా.. అని దేవుణ్ణి మొక్కుకుంటుంటే మాటల్లోనే వచ్చింది వదిన.. అదుగో.. కార్ హారన్.. పిలుస్తోంది. వణుకుతున్న కాళ్ళని స్వాధీనం లోకి తెచ్చుకుంటూ, కారెక్కబోతూ వదిన చెవిలో నెమ్మదిగా అన్నాను.. "వదినా, నేను ఆటలో అరటిపండునే. గుర్తు పెట్టుకో.." అంటూ. వదిన నవ్వింది. భగవంతుని మీద భారం వేసి కారెక్కేను.

పెళ్ళివారింటికి వెళ్ళిన పదినిమిషాలకి, మర్యాదలన్నీ పూర్తయ్యాక అమ్మాయిని తీసుకొచ్చారు హాల్లోకి. అమ్మాయి చెక్కినశిల్పంలా చక్కగా వుంది. పంజాబీసూట్ వేసుకుంది. ఇప్పుడు అందరు అమ్మాయిల్లాగే జుట్టుని స్వేచ్ఛగా వదిలేసింది. మామూలుగా వచ్చి, వాళ్ళమ్మగారి పక్కనున్న కుర్చీలో కూర్చుంది. "మా అమ్మాయి రేఖ. విప్రోలో పనిచేస్తోంది.." అని పరిచయం చేసారు వాళ్ళ నాన్నగారు. చేతులు రెండూ జోడించి నమస్కారం పెట్టింది. రాజీవ్‌ని చూసాను. అతని కళ్ళల్లో సంతోషం కనిపించింది. అమ్మయ్య.. అనుకున్నాను. "ఆఫీసు ఇక్కణ్ణించి దూరమేమో..ఎలా వెడుతుంది?" వదిన అడిగింది. నాకు చాలా ఆనందం వేసింది. వదినని ఏమో అనుకున్నాను కాని ఇప్పటి రోజుల్లో ఏమడగాలో తెలిసున్నదే అనుకున్నాను. "కాబ్ వస్తుందండీ.." అన్నారు వాళ్ళమ్మగారు. "నీ హాబీస్ ఏంటమ్మా.." అడిగింది వదిన. నవ్వుతూ "షాపింగ్.." అని చెప్పిందా అమ్మాయి.

ఇంతలో నానడుం పక్కన గట్టిగా ఏదో కుట్టింది.. ఒక్కసారి.. "అమ్మో.." అన్నాను. "ఏవయింది?" అంటూ ఖంగారుపడ్డారు పెళ్ళికూతురి తల్లి. "ఏదైనా కుట్టిందేమో.. లోపలికెళ్ళి చూద్దాం" అంటూ నా చేయి పట్టుకుని వాళ్ళింటి లోపలికి తీసుకుపోయింది వదిన. పక్కగా కనిపిస్తున్న బెడ్రూమ్‌లోకి వెళ్ళగానే నేను గట్టిగా నడుం రుద్దుకుంటూంటే.."ఏం కాదులే.. నేనే కాస్త గిచ్చాను.." అన్న వదిన మాటలకి తెల్లబోయాను. ఇది కాస్త గిచ్చడమా.. కండలు కదిలి వచ్చేట్టుంటే అనుకుంటూ అన్నయ్యాని తల్చుకుని కాస్త బాధపడ్డాను. ఇంకేమనలేక "ఎందుకూ?" అనడిగాను నెప్పితో నడుము మండిపోతుంటే. వదిన కాస్త గొంతు తగ్గించి, "చూసేవా.. ఆ పిల్లకి షాపింగ్ హాబీట. ఎలా చెప్పేసిందో చూసేవా? ఇంకేవుందీ.. మావాడు ఇంక క్రెడిట్ కార్డులు గీక్కుంటూ ఉండడమే.." అంది. "అది కాదొదినా.. ఆ పిల్ల కూడా సంపాయిస్తోంది కదా.." అన్నాను నడుం రాసుకుంటూ. "అమ్మో.. వీళ్ళు వట్టి పిసినార్లు. వీళ్ళు ఖర్చుపెడతారా?" అంది. "నీకెలా తెలుసూ?" అన్నాను. "ఆమాత్రం తెలీట్లేదూ? టీతో పాటు ఓ చిన్న ప్లేట్లో బిస్కట్లు మటుకు పెట్టారు. పెళ్ళిచూపులకొచ్చామని..యేం.. ఓ స్వీటూ, హాటూ పెట్టొచ్చు కదా.. అక్కడే తెల్సిపోటంలేదూ?" అంది.

"ఈ రోజుల్లో అందరూ అలాగే పెడుతున్నారు వదినా. పిల్ల బాగుంది కదా.. మనకి పిల్ల ముఖ్యం. రాజీవ్‌కి కూడా నచ్చినట్టే వుంది. " అన్నాను. "వాడిమొహం.. వాడికేం తెల్సు? అందం కొరుక్కు తింటామా ఏవిటీ? నువ్విక్కడే ఈ బాల్కనీలో కనపడకుండా వుండు. నెప్పి తగ్గలేదనీ, వేరే గదిలో పడుకున్నావని వాళ్లకి చెపుతాను. వాళ్ళు అబ్బాయినీ, అమ్మాయినీ పక్కకివెళ్ళి మాట్లాడుకోమన్నప్పుడు వాళ్ళు ఈ రూమ్‌లోకి వచ్చి మాట్లాడుకుంటారు. వాళ్ళేం మాట్లాడుకున్నారో నువ్వు జాగ్రత్తగా విని చెప్పు. అసలే ఆ అమ్మాయి చాలా చలాకీగా కనిపిస్తోంది. మనవాడిని ఏమేం అడుగుతుందో తెలిస్తే మన జాగ్రత్తలో మనం వుండొచ్చు" అంటూ నేను వద్దంటున్నా వినకుండా నా చేయిపట్టి బాల్కనీలోకి లాక్కుపోయి, అక్కడ నన్ను వదిలేసి వదిన హాల్లోకి వెళ్ళిపోయింది. ఇంక నా పరిస్థితి యేం చెప్పను.. ఒకవైపు నడుం దగ్గర మంట మరోవైపు దొంగలా బాల్కనీలో దాక్కోవల్సిన పరిస్థితి..ఆటలో అరటిపండులా వుంచుతానన్న వదిన నన్నిలా అకస్మాత్తుగా ఆటలోకి లాగేస్తుందని ఎలా అనుకోగలను? వదిన మీద పీకల్దాకా కోపం వచ్చింది.

ఇంకా నన్ను నేను సంబాళించుకుంటుండగానే ఆ రూమ్‌లోకి రాజీవ్, రేఖ వచ్చిన సవ్వడైంది. వదినని తిట్టుకుంటూనే ఆమె కోసం

తలుపుకి చెవి ఆనించేను. ఢబాలున తలుపు తెరుచుకుంది. ఆ తలుపుకి ఆనుకుని వున్న నేను ముందుకి తూలిపడబోతుంటే రేఖ లాఘవంగా పట్టుకుంది. దొరికిపోయిన దొంగలా వెర్రిమొహం వేసాను. హాల్లోంచి ఒక్కొక్కరూ ఆ రూమ్‌లోకి వచ్చారు.

వదిన గబగబా నా దగ్గరికి వచ్చి, "అయ్యయ్యో స్వర్ణా.. దెబ్బేం తగల్లేదు కదా!.." అంటూ నా చేతులు పట్టుకుంది. అన్నయ్య వదినని పక్కకి తప్పించి నా దగ్గరికి వచ్చి, "సారీ చెల్లాయ్.. వదిన ఇలా చేస్తుందని తెలీదు. వెర్రిమొహంది..పిన్నికి ఏదో సాయం చెయ్యాలనుకుని నిన్ను ఇలా ఇబ్బందిలో పడేసింది." అంటూ బాధపడ్డాడు. తెల్లబోయి చూస్తున్న నన్ను రాజీవ్ అక్కడే వున్న కుర్చీలో కూర్చోబెట్టి, "ఏమనుకోకండీ.. అసలు సంగతి మా అక్కకి తెలీదు.. నేనూ రేఖా ఆల్రెడీ ఆన్లైన్లో చాటింగ్ చేసుకుని, ఒకరి గురించి ఇంకొకరం తెలుసుకున్నాం. ఒకసారి పర్సనల్‌గా కలుసుకుని మా పేరెంట్స్‌ని పిలిచి ఆ విషయం చెప్దామనుకున్నాం. కాని ఈ లోపల మా అమ్మ, అక్క కలిసి ఇలా చేస్తారనుకోలేదు.

నా వల్ల మీరు పడ్డ ఇబ్బందికి నన్ను క్షమించండి.." అన్నాడు. అప్పటికి కాస్త తేరుకున్న నేను "అంటే మీరిద్దరూ ముందే డిసైడ్ చేసేసుకున్నారా?" అన్నాను ఆశ్చర్యంగా. వదిన ముందుకు వచ్చి, "చూసేవా స్వర్ణా, వీళ్ళిద్దరూ అప్పుడే అన్నీ మాట్లాడేసుకున్నారుట." అంది. నాకు ఒక రకమైన ఉక్రోషం వచ్చేసింది. "మరి ఉప్మా చేయించవూ రేఖ చేతా?" అనడిగాను వదినని. అది విని నవ్వుతూ రేఖ ముందుకు వచ్చింది.. "నేను అదీ నేర్చేసుకున్నానండీ. రాజీవ్ చెప్పాడు." అంది కాస్త సిగ్గుపడుతూ.. ఆ మాటలకి అక్కడున్న అందరం నవ్వకుండా వుండలేకపోయాం..




పూర్వం మాళవ రాజ్యాన్ని కీర్తి సింహుడు అనే రాజు పరిపాలించేవాడు. కీర్తి సింహుడి తండ్రి సమరసింహుడు ఆకస్మికంగా మరణించటంతో ఆ రాజ్యానికి ఏకైక వారసుడు అయిన కీర్తి సింహుడు చిన్న వయసులోనే సింహాసనం అధిష్టించాడు. తండ్రి అకాల మరణం తో గురుకులం లో తన విద్యాభ్యాసాన్ని అర్ధంతరంగా ముగించుకొని రాజ్య పాలన బాధ్యత లను స్వీకరించవలసి వచ్చింది. అలా అనుకోకుండా చిన్న వయసులోనే రాజ పదవి చేపట్టటంతో కీర్తి సింహుడికి కొద్దిగా అహంకారం పెరిగింది. తండ్రి సమర సింహుడి శాంత స్వభావానికి పూర్తిగా విరుద్ధమైన స్వభావం కల కీర్తి సింహుడు తాను దేశానికి రాజుని కనుక తన మాటే వేదంగా, తన వాక్కే శాసనంగా తన మంత్రులు, రాజోద్యోగులు, ప్రజలు అందరూ పాటించాలని భావించేవాడు. తన తండ్రి కి అత్యంత ఆప్తుడు, ఆ రాజ్యానికి ఎంతో కాలంగా మంత్రిగా ఎనలేని సేవలు అందిస్తున్న విక్రమసేనుడు సైతం అతని దుడుకు స్వభావాన్ని గమనించి, వీలైనంత గా మంచి సలహాలు చెప్పి కీర్తి సింహుడిని మార్చాలని ప్రయత్నించాడు. కాని కీర్తి సింహుడు పరిపాలనా సంబంధిత విషయాలలో తప్ప మిగతా విషయాలలో ఆయన మాటలను ఏ మాత్రం పట్టించుకొనే వాడు కాదు. తను చేయ దలచిన పనులను మరో ఆలోచన లేకుండా చేసేసేవాడు. అతని మొండి స్వభావం గురించి తెలిసిన వారు ఎవ్వరూ కీర్తి సింహుడి మాటకు ఎదురు చెప్పే ధైర్యం చేసేవాళ్ళు కాదు. ఎవరైనా చెప్పాలని చూసినా వారిని అందరి ముందూ అవమానకరంగా మాట్లాడి చిన్నబుచ్చేవాడు. రాజ మాత సైతం తన కుమారుడి ని పల్లెత్తు మాట అనటానికి జంకేది.

కీర్తి సింహుడుకి కొద్దిగా సంగీతం లో ప్రవేశం ఉన్నది. గురుకుల చదువు అర్ధంతరంగా ముగించటం వలన సంగీతం సాధన కూడా మధ్యలో వదిలేయవలసి వచ్చింది. సంగీతంలో పూర్తిగా పట్టు సాధించ లేకపోయాడు. తనకున్న మిడి మిడి జ్ఞానాన్నే గొప్పగా భావించుతూ తనకు సంగీతం గురించి ఎంతో తెలుసు అని, తానో సంగీత సామ్రాట్టు నని భావించేవాడు. కీర్తి సింహుడి తండ్రి సమర సింహుడికి లలిత కళలంటే ముఖ్యంగా సంగీతం అంటే చాలా ఇష్టం. కీర్తి సింహుడి తల్లి కూడా చక్కటి సంగీత విద్వాంసురాలు. సమర సింహుడి హయాము లో మాళవ దేశం లో గాయకులకు, కళాకారులకు, నాట్యకారులకు చక్కటి ఆదరణ ఉండేది. కీర్తి సింహుడు రాజు అయ్యాక గాయకులకు, కళాకారులకు క్రమేణా ఆదరణ తగ్గిపోసాగింది. నటులను, నాట్యకారులను, గాయకులను నిండు సభలో నిష్కారణంగా విమర్శించి వారిని అవమానించి ఆనందించేవాడు కీర్తి సింహుడు. తమ తమ రంగాలలో ఎంతో ప్రతిభా వ్యుత్పత్తులు చూపించి ఉద్దండులు గా పేరు తెచ్చుకొని కీర్తిసింహుడి తండ్రి హయాములో ఎంతో ఆదరణ పొందిన కళాకారులు క్రమేణా వేరే దేశాలకు వలస పోవటం మొదలు పెట్టారు. మరి కొందరు పుట్టి పెరిగిన దేశం అనే అభిమానం తో సరైన ఆదరణ లేక పోయినా ఎప్పటికైనా మంచి రోజులు రాక పోతాయా అనుకుంటూ ఆ కొలువులో అలాగే కొనసాగుతున్నారు.

కీర్తి సింహుడు సింహాసనాన్ని అధిష్టించి ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా మాళవ దేశం అంతటా ఘనంగా వేడుకలు జరపాలని నిర్ణయించారు. ఐదు రోజుల పాటు విందులు, నృత్య గాన వినోదాలు జరపాలని నిర్ణయించారు. నృత్య గానాదులలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమానాలు ఇవ్వాలని నిర్ణయించారు.

పనిలో పనిగా ఆస్థాన గాయకుడి పదవి కూడా ఖాళీ గా ఉన్నందున ఆ పదవికి కూడా నియామకం జరపాలని రాజమాత పనుపున మంత్రి విక్రమ సేనుడు నిర్ణయించాడు. నృత్య పోటీలను నిర్వహించి విజేతల ను ఎంపిక చేశాక సంగీత పోటీలను నిర్వహించాలని మంత్రి విక్రమసేనుడు తలపెట్టాడు. అయితే సంగీత పోటీకి తానే న్యాయ నిర్ణేత గా ఉంటానని కీర్తి సింహుడు చెప్పటంతో రాజు కోరికని తిరస్కరించ లేక సరేనని తల ఊపాడు మంత్రి విక్రమ సేనుడు.

సంగీత పోటీలు నిర్వహించే గడియ రానే వచ్చింది. దేశం నలుమూలల నుండే కాకుండా విదేశాల నుంచి కూడా గొప్ప గాయనీ గాయకులు పోటీలో పాల్గొనేందుకు వచ్చారు. ఒక్కొక్క గాయకుడు సంగీత కచేరీ ముగించగానే కీర్తిసింహుడు వారి గానం గురించి కాకుండా వారి ఆకారం గురించి, వారి కి ఉన్న అవకరాల గురించి వ్యాఖ్యానాలు చేయసాగాడు. ఒక గాయకుడు అద్భుతంగా పాడాడు. ఆ గానానికి సభ మొత్తం తన్మయమైపోయింది. ఆ గాయకుడికి కుడి కన్ను కొంచెం మెల్ల. కీర్తి సింహుడు ఆ మెల్ల గురించి ప్రస్తావించి "మెల్ల కంటి సంగీతం" అంటూ విమర్శించటం తో బాధ పడిన ఆ గాయకుడు అవమాన భారంతో తల వంచుకుని సభ నుండి నిష్క్రమించేలా చేసాడు. మరొక గాయకుడికి ఘట వాయిద్యం లాంటి బొజ్జ ఉన్నందున అతను "బొజ్జతో పాడినట్లుంది" అని ఎగతాళి చేసాడు కీర్తి సింహుడు. మరొకరు పాడిన సంగీతాన్ని "గార్దభ సంగీతం" అంటూ విమర్శించాడు. తనకు సంగీతం లో అంతంత మాత్రమే ప్రవేశం ఉన్నా శాస్త్రీయ సంగీతాన్ని అవుపోసన పట్టిన ఉద్దండులను సైతం వారి వారి బాహ్య రూపాలను, అవకరాలను ఎంచి కించ పరచటం చేయ సాగాడు. రాజు కాబట్టి ఎవరూ ఎదురు తిరిగి మాట్లాడలేక మౌనంగా తల దించుకుని నిష్క్రమించేవారు.

ఇలా ఐదు రోజుల పాటు సాగిన సంగీత పోటీలు రసాభాస గా ముగియ నున్న సమయంలో ఒక గాయకుడు సభలోనికి ప్రవేశించాడు. అతను తల నుండి పాదాల వరకు వల వంటి వస్త్రం కప్పుకున్నాడు. అతని రూపు రేఖలు సరిగా గుర్తు పట్టలేని విధంగా ఉన్నాడు. అతను మహారాజు కి నమస్కరించి తానూ సంగీత పోటీలో పాల్గొనేందుకు వచ్చానని తనది మాళవ రాజ్యానికి పక్కన ఉన్న వైదేహి రాజ్యం అని చెప్పాడు. అయితే తన గురువు గారు విధించిన నిబంధన ప్రకారం తను ఆ వల వంటి వస్త్రం లేకుండా పాడలేను కనుక తనకు ఆ వస్త్రం ధరించే పాడేందుకు అవకాశం ఇప్పించమని కోరాడు. ఏ కళ నున్నాడో కీర్తిసింహుడు ఆ గాయకుడి కోరికకు అంగీకరించాడు. సంగీత కచేరి ఆరంభం అయింది. ఆ గాయకుడు గొంతెత్తి పాడుతూ ఉంటె సభ మొత్తం తన్మయులై పోయారు. పాట ముగిసే సరికి సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగి పోయింది. కీర్తి సింహుడు సైతం ఆ గానం లో లీనం అయిపోయాడు. అప్రయత్నంగా కీర్తి సింహుడి నోటి నుండి "బాగు బాగు. శహబాష్ " అనే మాటలు వెలువడ్డాయి. అదే సరి అయిన అవకాశం గా భావించిన విక్రమసేనుడు వెంటనే ఆ గాయకుడు సంగీత పోటీలలో విజేత అని ప్రకటించాడు. కీర్తి సింహుడు సైతం ఆ నియామకానికి అభ్యంతర పెట్టటానికి ఏ విధమైన అవకాశం లేక పోవటంతో మౌనంగా తల ఊపాడు. విజేత గా ప్రకటించ బడ్డాక ఆ గాయకుడు తను కప్పుకున్న వల లాంటి వస్త్రాన్ని నెమ్మదిగా తొలగించాడు. ఆశ్చర్య కరంగా అతను అంతకు ముందు రోజులలో జరిగిన పోటీలలో కీర్తి సింహుడు "మెల్ల కంటి సంగీతం" అని వెక్కిరించిన గాయకుడే !!

అప్పుడు మంత్రి విక్రమ సేనుడు ఇలా చెప్పాడు "మహా రాజా సంగీతం అనేది కేవలం చెవులతో విని మనసుతో ఆస్వాదించేది. సంగీతం అనేది దైవ దత్తమైన విద్య. అది అందరకూ సాధ్యమయ్యే విద్య కాదు. సంగీతానికి రూపు రేఖలతో ప్రమేయం లేదు. చక్కటి గాత్రం, సంగీత శాస్త్రం పై అవగాహన ఉన్న వారే గాయకులుగా రాణించగలుగుతారు. మీరు ఇంతకు ముందు అనేక మంది గాయకుల గానాన్ని విన్నా వారి గానం కన్నా వారి రూపు రేఖలకు అధికమైన ప్రాధాన్యత ఇవ్వటం వలన, మీ దృష్టి అంతా వారి రూపు రేఖల పైనే ఎక్కువగా కేంద్రీకరించినందువలన వారి వారి సంగీత ప్రజ్ఞా పాటవాలను పూర్తిగా గమనించలేక పోయారు. అందుకే ఈ గాయకుడు తన రూపు రేఖలు కనుపించకుండా కేవలం తన గాత్రం మాత్రమే మీరు వినేలా చేశాడు. ఇతడి రూపు రేఖలు కనుపించ నందువలన తమరు అతని గానాన్ని పూర్తిగా ఆస్వాదించారు" అని ముగించాడు.

"మీరు చెప్పినది నిజమే. ఈ గాయకుడు ఈ పోటీలో అసలైన విజేత" అంటూ అంగీకరించాడు కీర్తి సింహుడు. ఈ విధంగా ముఖ కవళికలు తెలియకుండా సంగీత పోటీలో పాల్గొనమని సలహా ఇచ్చిన రాజ మాతకూ తన ఎంపికకు సహకరించిన మంత్రి విక్రమ సేనుడికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు ఆస్థాన గాయకుడు గా నియమితుడైన శ్రీధర శాస్త్రి.

**********************************




“ కావేరీ ఎక్కడ తగలడ్డావే ? “ అన్న శిరీష గర్జన వినిపించగానే , దొడ్లో మొక్కలకి నీళ్ళు పెడుతున్న కావేరి గబాలున పరిగెత్తుకొచ్చింది హాల్లోకి.

“ నీ కూతురు గచ్చంతా ఎలా పాడు చేసిందో చూడు. నీకెన్ని సార్లు చెప్పాలే , పని చేయటానికి వచ్చేటప్పుడు నీ కూతురిని నీతో పాటు తీసుకుని రావద్దని. మనిషన్నాక కాస్తంత బుద్ధి ఉండక్కర్లా “ అని శిరీష తిడుతుంటే “చెమించండమ్మా. మా అత్తకి నాలుగు రోజుల నుంచి జొరంగా ఉందమ్మా . అందుకే బొట్టిని నాతో తోలుకొస్తిని. యిప్పుడే తుడిచేస్తానమ్మా “ అంటూ తడి బట్ట తెచ్చి కావేరి గచ్చంతా శుభ్రం చేస్తున్నా కూడా “ఛీ ఛీ అలగా జనం , అలగా బుద్ధులు. “ అని విసుక్కుంటూ బెడ్ రూమ్ లోకి వచ్చింది శిరీష.

ఆఫీసు కని తయారవుతూ టై కట్టుకుంటున్న శిరీష భర్త అభిరాం “ ఏమిటా మాటలు శిరీ . పని వాళ్ళూ మన లాగా మనుషులేగా. పొరపాట్లనేవి జరిగి నప్పుడు కాస్త ఓర్పు వహించాలి, అంతే గానీ నోటికొచ్చినట్లు యిలా మాట్లాడ కూడదు “ అంటున్న అతని వైపు కోపంగా చూసింది శిరీష.

“అసలు మిమ్మల్ని అనాలి. మీరిచ్చిన అలుసు తోనే వాళ్ళు యిలా పేట్రేగి పోతున్నారు. ఎక్కడి వాళ్ళని అక్కడే ఉంచాలి “ అంటూ యింకా ఏదో అన బోయేంతలో , ఫోన్ మ్రోగడంతో హాల్లోకి విసా విసా నడిచింది శిరీష.

అభిరాం డైనింగ్ టేబుల్ దగ్గరకి వచ్చి కూర్చోగానే , వంటావిడ పార్వతమ్మ వేడి వేడి పూరీలు, బంగాళ దుంప కూర తెచ్చి అతనికి ప్లేటులో వడ్డించింది.

పూరీలు తింటూ “ కూర చాలా రుచిగా వుంది పార్వతమ్మా . అన్నట్టు మీ అమ్మాయి పూజ బాగా చదువుతోందా “ అని అభిరాం అడిగిన దానికి “ మీ దయ వల్ల బాగానే చదువుతోంది బాబూ. ఈ ఏడు తో దాని చదువు పూర్తవుతుంది. ఆ తరవాత ఏదైనా ఉద్యోగంలో అది నిలదొక్కుకుంటే , మా కష్టాలు తీరి పోతాయి“ అంటూ కాఫీ తీసుకుని రావడానికి వంటింట్లోకి వెళ్ళింది పార్వతమ్మ.

యిదంతా వింటున్న శిరీష “ ఈ కబుర్ల కేమీ తక్కువ లేదు. మీరెంత సాయం చేసినా వీళ్ళకి కృతజ్ఞత అన్నది వుండదండీ . మొన్నటికి మొన్న, మా ఫ్రెండ్ పరిమళ, అదే మీకు తెలుసుగా లీడింగ్ లాయర్ కృష్ణ మూర్తి గారి వైఫ్, వాళ్ళింటికి చుట్టాలు వచ్చి పనెక్కువ అవడంతో కాస్త సాయానికి వీళ్ల అమ్మాయి పూజని వాళ్ళింటికి పంపించమంటే ససేమిరా పంపనందీవిడ. అవసరానికి మొండి చేయి చూపిస్తారు . అలగా జనం , అలాగా జాతి , వాళ్ళ బుద్ధులే అంత. అందుకే వాళ్ళ తల రాతలూ అలాగే ఏడుస్తాయి “ అంది భర్తతో నిరసనగా.

“ తప్పు శిరీ . అలా మాట్లాడకు. కాలేజి లో చదువుకుంటున్న పిల్లని అలాంటి పనులకి ఎవరైనా ఎలా పంపుతారు చెప్పు “ అన్నాడు అభిరాం శిరీష కి నచ్చ జెబుతున్నట్లుగా .

“ మీతో చెప్పుకున్నాను చూడండీ , నన్ను నేను చెప్పుతో కొట్టుకోవాలి. మీరెప్పుడూ వాళ్ల పక్షమేగా . యిలా మీరన్నింటికి వాళ్ళని వెనకేసుకొస్తుంటే, మీ అండ చూసుకునే, వాళ్ళు మరీ నెత్తికెక్కుతున్నారు “ అని శిరీష పెద్ద గొంతుతో అంటుంటే “ ఈ మనిషి తీరింతే. తనని మార్చడం ఎవ్వరి వల్లా కాదు. కాలమే తనలో మార్పు తేవాలి ” అనుకుని మనసు లోనే నిట్టూర్చాడు అభిరాం.

* * *

ఆఫీస్ పని మీద అభిరాం లండన్ వెళ్లి వారం రోజులయ్యింది. మరో రెండు వారాలకి గానీ తిరిగి రాడు .

“ ఈ డ్రైవర్ వెధవ ఈ రోజు యింకా రాలేదు. అడ్డమైన వెధవలనీ పనిలో పెట్టుకుంటే యింతే మరి. యిలాంటి అలాగా జనాన్ని పని లోంచి తీసేద్దామంటే ఈయన పడనివ్వరు . ‘ఏళ్ల తరబడి మననే నమ్ముకుని వున్నారూ’ అంటారు. కాని ఆ విశ్వాసమేమైనా వుందా అసలు వాళ్లకి. అంతా నా ఖర్మ “ అని సణుక్కుంటూ శిరీష అలా సోఫాలో కూర్చుందో లేదో ఫోన్ మ్రోగింది.

“ మీ అబ్బాయి అరవింద్ కి ఆక్సిడెంట్ జరిగింది, మణి పాల్ హాస్పిటల్లో వున్నాడు “ అన్న వార్త ఫోన్ లో వినగానే శిరీషకి కాళ్ళూ , చేతులూ ఆడ లేదు. సమయానికి అభిరాం ఊళ్ళో లేడు, డ్రైవరేమో అతీ పతీ లేడు . ఏం చేయడానికీ పాలు పోలేదు.

వెంటనే తన ప్రాణ స్నేహితురాలు పరిమళ కి ఫోన్ చేసి విషయం చెప్పి , తనకి సాయంగా వాళ్ళ కారు తీసుకుని హాస్పిటల్ కి తోడుగా రమ్మని రిక్వెస్ట్ చేసింది శిరీష.

అంతా విన్న పరిమళ “ సారీ శిరీషా . నేనూ , మా వారు ఈ రోజు ఎగ్జిబిషన్ కి వెళ్తున్నాము. తీరిక చేసుకుని బాబుని చూడడానికి ఈవెనింగ్ హాస్పిటల్ కి వస్తాములే ” అని చెప్పిన సమాధానానికి హతాశురాలైంది శిరీష.

మాటా పలుకూ లేకుండా ఫోన్ రిసీవర్ పట్టుకుని అలాగే ఉండి పోయిన యజమాను రాలిని చూసిన పార్వతమ్మ, పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే బయటకు వెళ్లి ఆటో పిలుచుకుని వచ్చింది. శిరీషని ఆటోలో కూర్చోబెట్టి సాయంగా తనూ ఆమె వెంట హాస్పిటల్ కి వెళ్ళింది. హాస్పిటల్ కి చేరే వరకూ కూడా శిరీష కి ధైర్యం చెబుతూనే వుంది.

హాస్పిటల్ లోని వార్డ్ లో ఒళ్ళంతా బ్యాండేజీలతో వున్న బాబుని చూసేటప్పటికి , పై ప్రాణాలు పైనే పోయినట్లు అయ్యింది శిరీషకి.

బాబు కి వైద్యం చేస్తున్న డాక్టర్, శిరీషని చూసి, “ ఏమ్మా, మీరేనా బాబు మదర్ ? బాబు కి దెబ్బలు బలంగా తగిలాయి. రక్తం చాలా పోయింది. వెంటనే రక్తం ఎక్కించాలి. బాబుది అరుదైన బ్లడ్ గ్రూప్. ఓ పాజిటివ్ . మా దగ్గర ప్రస్తుతానికి స్టాక్ లేదు. మీరు వెంటనే రెండు బాటిల్స్ అరేంజ్ చేస్తే , మా ప్రయత్నాలు మేము చేస్తాము “ అని చెప్పేసి మరో పేషెంట్ ని చూడడానికి వెళ్ళాడు.

బాబుని ఆ స్థితిలో చూసేటప్పటికి, శిరీష కి దుఃఖం ఆగట్లేదు. డాక్టర్ చెప్పిన మాటలు ఆమెకి అసలు అర్థం కూడా అయినట్లు లేవు.

పార్వతమ్మే “అమ్మా, మనింటికి ఎప్పుడూ వస్తుంటుందే మీ స్నేహితురాలు మాధురమ్మ. ఆవిడదీ, బాబుదీ ఒకే గ్రూప్ రక్తమని మీరు అప్పుడప్పుడు అనుకుంటుండే వారు కదమ్మా. ఆమెకి ఫోన్ చేసి పిలిపించండమ్మా“ అని చెప్పగానే వెంటనే తేరుకుని మాధురి కి ఫోన్ చేసింది శిరీష .

ఫోన్ లో శిరీష గొంతు వింటూనే మాధురి హుషారుగా “హాయ్ శిరీషా, వాటే కో యిన్సిడెన్స్ , నేనే నీకు ఫోన్ చేద్దామని అనుకుంటున్నాను , ఈ లోగా నువ్వే చేసావు. ఈ రోజు రిలీజ్ అవుతున్న షారుఖ్ ఖాన్ మూవీ ఈవెనింగ్ షో కి రెండు టికెట్స్ దొరికాయి. నేనొచ్చి నిన్ను పికప్ చేసుకోనా సాయంత్రం ..“ అంటూ యింకా ఏదో చెప్ప బోతుంటే మధ్య లోనే ఆమెని ఆపి బాబు విషయం చెప్పింది శిరీష.

“బాబుదీ, అభిదీ ఒకే బ్లడ్ గ్రూప్ మాధురీ , కానీ సమయానికి అభి ఊర్లో లేడు. నీదీ ఓ పాజిటివ్ గ్రూపే కదూ. నువ్వు కొంచం త్వరగా యిక్కడికి వచ్చి బాబుకి రక్తం యిస్తే మా బాబుని బ్రతికించిన దానివవుతావు , ప్లీజ్ “ అని రిక్వెస్ట్ చేసింది శిరీష.

“ సారీ శిరీషా, నీకు తెలుసుగా, నాకు హాస్పిటల్స్ అంటే అలర్జీ. బ్లడ్ ని చూస్తేనే కళ్ళు తిరిగినంత పని అవుతుంది నాకు. పైగా నా ఫేవరెట్ హీరో షారుఖ్ ఖాన్ మూవీని మొదటి రోజే చూడక పోతే నాకు నిద్ర పట్టదని నీకు తెలుసుగా “ అంటూ ఫోన్ కట్ చేసేసింది మాధురి.

స్నేహితురాలి మాటలకి స్పృహ తప్పినట్లైన శిరీష , కుర్చీలో ఒక ప్రక్కకి ఒరిగి పోతుంటే పడి పోకుండా వెంటనే ఆమెని పట్టుకున్నారు పార్వతమ్మ, అప్పుడే అక్కడికి వచ్చిన ఆమె కూతురు పూజా.

* * *

శిరీషకి స్పృహ వచ్చి కళ్ళు తెరిచేటప్పటికి, ఆమె కి గ్లూకోజ్ ఎక్కిస్తున్నారు. “బాబూ అరవింద్ “ అంటూ లేవ బోయేటప్పటికి, ప్రక్కనే సెలైన్ బాటిల్ అడ్జస్ట్ చేస్తున్న పూజ , ఆమెని ఆపి “ ఆంటీ , అరవింద్ కి ఏమీ ప్రమాదం లేదు, తను క్షేమంగానే వున్నాడు. మీరు నాతో రండి “ అంటూ శిరీషని అరవింద్ వున్న రూమ్ కి తీసుకుని వెళ్ళింది .

అక్కడ బెడ్ మీద నీరసంగా పడుకుని వున్న అరవింద్ , శిరీషను చూస్తూనే “ మమ్మీ, నువ్వెక్కడికి వెళ్లావు? పూజక్కని అడిగితే ప్రక్క రూమ్ లో డాక్టర్ తో మాట్లాడుతున్నావని చెప్పింది. డాక్టర్ ఏం చెప్పారు మమ్మీ? నాకు త్వరలోనే నయమౌతుందన్నారా? నెక్స్ట్ మంత్ మా స్కూల్ లో బాడ్మింటన్ సెలెక్షన్స్ వున్నాయి కదా. అప్పట్లోగా నేను నార్మల్ అవుతానా మమ్మీ? “ అని

అడుగుతున్న బాబు ప్రశ్నలకు సమాధానం చెబుతున్న శిరీష , బాబుకి కుడి వైపున బెడ్ మీద కావేరిని  చూసి ఆశ్చర్య పోయింది.

అది గమనించిన పూజ " ఆంటీ, కావేరిదీ కూడా అరవింద్  బ్లడ్ గ్రూపే. వాళ్ళ అత్తని డాక్టర్ కి చూపించడానికి వచ్చిన కావేరి మిమ్మల్ని, బాబుని యిక్కడ ఈ స్థితిలో చూసి వెంటనే బాబుకి రక్తం యివ్వడానికి ముందు కొచ్చింది " అని చెప్పింది.

శిరీష వెంటనే కావేరి  దగ్గరకు వెళ్లి ఆమె  రెండు చేతులూ పట్టుకుని " కావేరీ , నా బాబుకి ప్రాణ దానం చేసావు. ఏమిచ్చినా నీ ఋణం తీర్చుకో లేను " అని గద్గద స్వరం తో అంది.

"ఊరుకోండమ్మా. యిందులో నేను చేసిందేముంది? మనిషికి మనిషి సాయం. నాకే యిలాంటి కష్టం వస్తే, మీరూ, అయ్య గారూ చూసుకోరా? అరవింద్ బాబుని ఈ చేతులతో పెంచానమ్మా . నాకు మా బొట్టెంతో , అరవింద్ బాబూ అంతే కదమ్మా "  అని కావేరి అంటుంటే శిరీష కి ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు.

" తన కష్టాన్ని వాళ్ళ కష్టంగా బావించి యింత సాయం చేసిన వీళ్ళనా తను యింతకాలం 'అలగాజనం' అంటూ ఈసడించుకుంది " అని ఎంతో పశ్చాత్తాపపడింది శిరీష.

* * *

ఆభిరాం లండన్ నుండి తిరిగి వచ్చాడు. జెట్ లాగ్ అదీ  పూర్తయి  స్నానం చేసి బ్రేక్ ఫాస్ట్ కి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోగానే, దోసెలు, కొబ్బరి చట్నీ వడ్డించిన  పార్వతమ్మ లోనికి వెళ్ళబోతుండగా " పార్వతమ్మా, ఈ నెల మన పూజకి ఫైనల్ టర్మ్ ఫీజు కట్టాలేమోగా, యిదిగో తీసుకో " అంటూ డబ్బు ఆమె చేతికి యిచ్చింది శిరీష.

అక్కడే హాల్లో అద్దాలు తుడుస్తున్న కావేరి తో " కావేరీ, అయ్యగారు లండన్  నుండి చాక్లెట్లు తెచ్చారు. ఫ్రిడ్జ్ లో పెట్టాను చూడు. యింటికి వెళ్ళేటప్పుడు నీ  కూతురికి తీసుకుని వెళ్ళు. అన్నట్టు  దానికి సేమ్యా పాయసం అంటే చాలా యిష్టమన్నావు కదూ. పార్వతమ్మా, ఈ రోజు మీరు చేసిన పాయసాన్ని కావేరికి ఒక బాక్స్ లో యిచ్చి పంపండి వెళ్ళేటప్పుడు" అని చెబుతున్న  శిరీషని చూస్తూ అభిరాం ఎంతో ఆనంద పడ్డాడు తానెంతగానో ఆశించిన మార్పు భార్యలో యింత కాలానికి కనిపిస్తుంటే.

"చ...అలగా జనం అలగా జనం అంటూ ఇంత కాలం ఎంత తప్పుడు అభిప్రాయం పెంచుకున్నానండీ...వాళ్ళ ల్లోనే ప్రేమాభిమానాలుంటాయని అర్ధం చేసుకో లేక పోయాను...." అంటున్న శిరీషని చూస్తూ అభిరాం " చూడు శిరీషా, తప్పు చేసానని అంటూ అదే తప్పు మళ్ళీ చేస్తున్నావు...మంచి బుద్ధులూ, ప్రేమాభిమానాలూ పేద వాళ్ళల్లోనే ఉంటాయనేది కరెక్ట్ కాదు...అలాగని ధనిక వర్గాల మనసుల నిండా ఈర్ష్యా అసూయా ద్వేషాలు, మనుషులని వాడుకుని వదిలేసే బుద్ధులూ ఉంటాయనేది కరెక్ట్ కాదు....మంచి చెడులకు ఏ వర్గమనేది కొలమానం కాని గీటురాయి గాని కానే కాదు....ఇంత కాలం అలగా జనమంటూ వాళ్ళ మీద తక్కువ చూపు చూసిన నువ్వే ఇప్పుడు వాళ్ళ మీద అమాంతం ప్రేమ పెంచేసుకుని డబ్బున్న వాళ్ళ మీద ద్వేషం పెంచేసుకోవడం విడ్డూరంగా ఉంటుంది" అన్నాడు...అవునన్నట్టుగా తల ఊపింది శిరీష..




ఆ రోజు బూదవ్వ, ఆవిడ ఒక్కగానొక్క కొడుకు పొలం పనులకి పోయి వచ్చి అరుగు మీద కూర్చున్నారు. అదిగో అప్పుడే వచ్చాడు గంగేసు, భూముల బ్యారం చేస్తాడు, బ్యారం అంటే వాడు డబ్బు పెట్టి భూములు కొనడం కాదు, డబ్బున్న ఆసాములకు, భూములు కొని తమ వద్ద మూలిగే డబ్బుని స్థిరాస్తిగా మార్చుకునే భూ బకాసురుల కోసం ఈ పల్లెలో అమాయకులని మభ్య పెట్టి, డబ్బు ఆశ చూపి, బుట్టలో వేసే బ్యారం చేస్తాడు, ఒక్కమాటలో చెప్పాలంటే బ్రోకర్ పని చేస్తాడు,దానికి తగిన ప్రతిఫలం భూమి విలువ కట్టిన వారి దగ్గర తీసుకుంటాడు. అలా సంపాదించే సిటీ లో నాలుగు కమెర్షియల్ కంప్లెక్సులు కట్టాడు, అదే ఆ పల్లెలో వాడికి వాడి మాటకి విలువ తెచ్చింది, వాడు ఏదయినా చెబితే నమ్మేలా చేసింది. అదే డబ్బు

చేసే మేజిక్, ఆ మేజిక్ బూదవ్వని కూడా బుట్టలో పడేసేలా చేసింది.

అరుగు మీద కూర్చున్న భూదవ్వని,  " ఏం బూదవ్వ బాగున్నావా, పొలం పనులు బాగా సాగుతున్నాయా, నీ కొడుకు కూడా ఈన్నే ఉన్నాడు కదా, ఎరా  రాజేశం అంతా బాగేనా కొద్దిగా బక్కగైనట్లున్నావ్, మీ అవ్వ కూడు సక్కగా పెడుతా లేదారా ? "ఏందిరా అట్లంటవ్? నాకున్నది ఆడొక్కడేనాయె, ఆన్ని కూడు వెట్టక సంపుతానా??,

నా పెనిమిటేమో ఏనాడో వాగ్గడ్డకు వాయె, నాకు ఆడు ఆడికి నేను, పొలం పనుల తోటి కొద్దిగా పనెక్కువై అట్లా కనవడుతున్నాడు గని, ఏందీ సంగతి నువ్వు ఇట్లా వచ్చినవ్ ఆరా తీసింది బూదవ్వ. బూదవ్వ కొడుకు రాజేశం కాస్త అమాయకుడు, వ్యవసాయం పనులు, ఇంటి పనులు తప్ప ఏది పెద్దగా పట్టించుకునే వాడు కాదు, బయటి పనులు చేయ నిచ్చేది కాదు బూదవ్వ, అంతా తానే చూసుకునేది.

"ఏం లేదు బూదవ్వా,  నీ పొలం హై వే కి ఆనుకుని ఉన్న ఒక ఎకరం పొలం ని ఐదెకరాలు చేసే మంచి మార్గం ఒకటుంది చెబుదామని వచ్చినా....." మెల్లగ వ్యవహారం మొదలెట్టిండు గంగేసు...

"ఆ ఏందీ ఒక ఎకురం పొలం ఐదుకురాలు చేసే మార్గమా?" ఆశ్చర్యం, ఆనందంతో బూదమ్మకు తెల్వకుండనే కండ్లు పెద్దగైనయి...

"ఆ(..ఆ(..ఐదెరాలు, నీ పొలాన్ని యాభై లచ్చలకి ఎవరికన్నా అమ్మినవానుకో, అదే ధరకి మనూరి చెరువు దగ్గర ఐదెకరాలు పొలం భూమి కొనచ్చు, కొనచ్చు" మొదటి పాచిక విసిరిండు గంగేసు...

"సరే, అది కొనేదెవరట?" బూదవ్వలో అనుమానం....

"అక్కడికే అస్తున్న....నాకు తెలిసిన ఒక పెద్దాయన ఉన్నాడు, పట్నంల ఉంటడు, బాగా బలిసినాయన, డబ్బులు బాగా ఉన్నోడు, ప్లాట్ల దందా చేస్తడు, మన హైవే దగ్గరి పొలంల ప్లాట్లు పెట్టి అమ్ముదామని అయన ఆలోచన, నువ్వు ఊ అంటే సాలు ఇయ్యాలనే పిలిపిస్తా" ఆశపెట్టిండు గంగేసు..

"కానీ ఒరేయి గాంగేషు, అది నీళ్ల పార్కం సవులతున్న భూమి యాడాదికి మూడు పంటలు కూడా పండుతాయి ఓపికుండాలే

అంతే, బంగారు గుడ్లు పెట్టె బాతుని ఎట్లా అమ్మలినా అని?"ఆశ కల్గినా బూదవ్వకు కన్నతల్లిలాంటి పొలం మీద మమకారం వెనక్కు లాగుతోంది...

"బూదవ్వ నీకు తెల్వనట్టే చేస్తావేందే....ఈ బంగారు బాతునమ్మి ఇసుంటి బంగారు గుడ్లు పెట్టె ఐదెకరాల బాతుని నీకు కొని పెట్టె పూచి నాది, నేనొక్కటే మాట అడుగుతా బూదవ్వ...ఈ ఎకరం నువ్వే ఉంచుకున్నవనుకో దాంతోటి ఎం జేస్తవ్? వ్యవసాయం, మరి చెరువు గట్టు కింద ఐదెకరాల పొలం కొన్నావనుకో, అప్పుడేం జేస్తవ్? వ్యవసాయం.. కానీ ఇక్కడికి అక్కడికి ఎంత తేడా నాలుగెకరాల....? అంటే నీకు ఈడ ఐదేండ్లు చేసే ఎవసాయం అక్కడ ఒకేడాదే చేయచ్చు.....బూదవ్వ కి ఐదెకరాల పొలం ఉందంటే ఎంత విలువా...నీ కొడుక్కి కూడా మంచి సంబంధం చూసి పెళ్లి చెయ్యచ్చు......ఆలోచించు.." కొద్దిసేపు మౌనం రాజ్యమేలింది....

బూదవ్వ ఆలోచనలో పడింది.....గంగేసు మాటలు నిజమే అనిపించాయి....మత్తు ఇంజక్షన్ లాగా గంగేసు చెప్పిన విషయాలన్నీ భూదవ్వని ఆక్రమించాయి..

మత్తులో ముంచేశాయి....అదే మత్తులో "సరే నువ్వన్నట్టే కానిద్దాం....కానీ ఒరేయ్ గంగేసూ పైసలన్నీ ముట్టినంకనే రిజిష్టరీ, ఏంటనే యెల్లి ఆ ఆసామిని పిలిసుక రా....." అని చెప్పింది...

***********

గన్గేసు వెళ్లి ఆ పెద్దాయనను పిచుకొనిరావడం, బూదవ్వ భూమి కొలతలు చేయించడం, రేటు కుదుర్చుకోవడం, భూమి కాగితాలు చూసుకుని అంతా పక్కాగా ఉందొ లేదో చూసుకోవడం, "ఒక మంచి రోజు చూసుకుని వస్తాము, వాయిదాలు లేవు ఒకే ఇన్ స్టాల్ మెంట్ లో డబ్బు కట్టేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకుంటాము " అని చెప్పి వెళ్లి పోవడం, ఈ విషయాలన్నీ బూదవ్వ కొడుకుకి చెప్పి ఒప్పించడం, బూదవ్వ గన్గేసు చెప్పిన చెరువు గట్టు క్రింది భూమి చూసి రావడం, ఆ భూమి రేటు మాట్లాడుకోవడం, సిటీ పెద్దాయన డబ్బు కట్టిన మరుసటి రోజునే డబ్బు కట్టి భూమి రిజిస్టేషన్ చేయించుకుంటామని మాట పక్క చేయించుకోవడం, అన్ని చక చకా జరిగి పోయాయి.

************

పెద్దాయన చెప్పిన రోజు రానే వచ్చింది, రెజిస్ట్రేషన్ తంతు ముగిసింది, పెద్దాయన ఒక లగేజి బ్యాగు నిండా డబ్బు కట్టలు నింపి

ఇచ్చాడు, అన్ని వెయ్యి రూపాయల నోట్ల కట్టలు, బూదవ్వ బ్యాగు తీసుకుని ఇంటికి బయలుదేరింది, డబ్బు జాగర్తగా దాయమని, ఎవరి కంటా పడకుండా తీసుకెళ్లామని, రేపు పొద్దున్న వెళ్లి చెరువు గట్టు క్రింది భూమికి బయానా ఇద్దామని, జాగర్తలు చెప్పి పెద్దాయనతో కలిసి వెళ్లి పోయాడు గంగేసు, డబ్బు బ్యాగుతో ఇంటికి చేరింది బూదవ్వ.... బ్యాగు మరో సారి విప్పి చూసుకుంది, అన్ని వెయ్యి రూపాయల నోట్ల కట్టలు, బ్యాగు విప్పగానే వాసన డబ్బు వాసన అదో రకమైన వాసన, మత్తు మందు పెట్టినట్లు మైకం కమ్మేసే వాసన, ఆ మత్తు కోసం ఎన్నో నేరాలు చేయించే వాసన, ఆ మత్తుతో మంచిని చెడుగా చేసే వాసన,చెడుని మంచిగా మార్చే వాసన, తెగి పోయిన బంధాలను కలిపే వాసన, ప్రేమల్ని సృష్టించే వాసన, ప్రాణాలు తీయించే వాసన, ప్రాణాలు నిలిపే వాసన, ప్రభుత్వాలు నడిపే వాసన, ప్రభుత్వాలు కూల్చే వాసన, మంచి మంచి వారినే తన చిటికెన వేలు పైనా నిలుపుకుని ఆడించే డబ్బు వాసన, ఆ వాసన మైకంలో బూదవ్వ తేలి పోసాగింది, రేపటి నుండి మా జీవితం మారిపోతుంది, నా కొడుకు జీవితం మారి పోతుంది, నా కొడుకు బంగారు జీవితం కోసం నేను కన్న కలలు నిజం కాబోతున్నాయి..ఆలోచనలతో, ఆనందంతో ఉక్కిరి బిక్కిరి కాసాగింది బూదవ్వ, డబ్బుని జాగర్త చేసి పడుకుంది, నిద్రే రావడం లేదు, అదే ఆలోచనతో తెల్ల వారింది, ఎంతో ఉత్సాహంగా...రాత్రి ఆలోచనతో నిద్ర లేకున్నా ఎంతో ఉల్లాసంగా నిద్ర లేచింది బూదవ్వ.....

పక్కింటి శ్రీలక్ష్మి ఉరుకుల మీద....."బూదవ్వ బూదవ్వ ఇది విన్నావా ఇది విన్నావా....." అంటూ పరిగెత్తుకుంటూ వచ్చింది.

" ఏంటే ఆ ఎగిర్థం...ఏదో కొంపలంటుకు పోయినట్లు, ఏందీ, జర స్థిరం బట్టు....ఇప్పుడు సెప్పు....

"మీరు నిన్న జాగా అమ్మింండ్లు కదా?"

"అవును అమ్మినం...రిజిస్ట్రేషని కూడా అయిపాయె ఇప్పుడెందుకు ఆ యిసయం...?"

"రెజిస్ట్రేషని కూడా అయిందా....పైసలు కూడా ముట్టినాయ....?"

"ముట్టంది నేనెందుకు సంతకం బెడుతనే....ముట్టినయ్" "పైసలు ఎయ్యి రూపాల నోట్లు, ఐదు వందల నోట్లు గిట్ల యిచ్చిండా...?"

"ఎందుకే....? ఏ పైసలిస్తే నీకెందుకు.....ఏమో బాగా ఆరాలు దీయవడ్తివి"

"ఆరాలు కాదు బూదవ్వ నీ మంచి కోరే అడుగుతున్న.....పొద్దుగాల్ల టి.వి.వార్తలల్ల సెప్తున్నారు........ఇయ్యాళడ్సంది ఎయ్యి

రూపాల నోట్లు, ఐదు వందల నోట్లు నడవయంటా...., ఏదో నల్ల డబ్బంటే....ఇయ్యల్లసంది అవన్నీ ఉట్టి కాయిదాల తోని సమానమంటా.......

ఒక్కో మనిషి దగ్గర రెండున్నర లచ్చల కంటే ఎక్కుంటే అదంతా నల్ల డబ్బంట, అవన్నీ లెక్క సెప్పాల్నాటా, లేక పోతే జైలుకే నాటా, తనకు తెలిసినవి తెలియనివి అన్ని విషయాలు కలగా పులగంగా చెప్పింది పక్కింటి శ్రీలక్ష్మి.....శ్రీలక్ష్మి చెప్పిన విషయం విన్నంతనే బూదవ్వకి గుండెల్లో కత్తితో పొడిచి నంత పనయింది, శ్వాస ఆడకుండా ఎవరో గొంతు నులుముతున్నట్లు ఊపిరి ఆడడం లేదు బూదవ్వకి, ఏం చేయాలి ఇప్పుడు, నిన్న పెద్దాయన ఇచ్చిన నోట్లన్నీ ఎయ్యి రూపాయల నోట్లే.....మల్లి ఒక సారి లోపలికి వెళ్లి బ్యాగు తెరిచి చూసింది, అవును అన్ని వెయ్యి రూపాయల నోట్ల కట్టలే.....ఏం చేయాలో తోచ లేదు బూదవ్వకి, గంగేసు......ఓ గంగేసూ.....ఒక్క సారిగా గురుతుకు తెచ్చుకుని గంగేసు దగ్గరికి వెళ్లి చెబితే ఏమైనా ప్రయోజనం ఉంటుందేమో అని గంగేసు ఇంటికి పరుగు తీసింది........గంగేసు ఇంట్లో లేడు......ఇయ్యాల మబ్బులనే ఆగమాగంలా బీరువా అంత సదురుకుని, బ్యాగుల పెట్టుకుని, ఎంత అడిగినా ఏం సప్పుడు చేయకుండా....గాలి గాలిలా ఎల్లి పోయిండు పట్నం బోతానని చెప్పింది గంగేసు పెళ్ళాం.

అయ్యో అట్లన ఇప్పుడెట్లా అనుకుంటూ తన ఇంటి వైపు నడవ సాగింది, "ఏమైంది బూదవ్వ" అని గంగేసు పెండ్లాం పిలిచినా వినిపించుకోకుండా...వెళ్ళి పోయింది ఇప్పుడే వెళ్లి ఈ విషయం తన కొడుకుకి చెబితే? చెప్పినా వాడికేం తెలుస్తది వాడుట్టి ఎర్రి బాగులోడు, మరి ఎవరికి చెప్పాలి, ఏం చేయాలి, కొడుకు జీవితం బాగు పడుతుందని ఉన్న ఒక ఎకరం పొలం అమ్మితే ఇంత పనైంది, నా దగ్గరున్న పైసలన్నీ పనికి రావట, ఇది నిజమేనా.....?" ఇంటికి నడుచుకుంటూ... దారి మధ్యలో కలిసిన వారినల్లా అడిగింది, నోట్లు నడవయనే అందరు చెబుతున్నారు, అంటే అది నిజమే అవును నిజమే, నా దగ్గరున్న నోట్లన్నీ పనికి రావు యాభయ్ లచ్చలు ఒకటా రెండా యాభయ్ లచ్చలు, బూదవ్వ కాళ్ళ కింద భూమి కదిలి పోయినట్లు అయింది, కళ్ళు తిరిగినట్లు అయిన్ది, కొడుకు గూర్చి ఆలోచిస్తే ప్రాణం పోయినట్లు అవుతుంది, ఇప్పుడు తన దగ్గర ఉన్న నోట్లన్నీ చిత్తు కాగితాలతో సమానం అని తలుచుకుంటేనే పై ప్రాణాలు పైనే కలిసి

పోతున్నాయి.......

తన కొడుకు జీవితం తన చేతుల తోనే నాశనం చేసినట్లు అయింది, ఇప్పుడు నా కొడుకుకి ఏం ముఖం చూపించాలి, అవ్వ గిట్ల జేసిన వేందే అంటే ఏం సమాధానం జెప్పాలె, ఆలోచనతో ఇంటికి చేరుకుంది, ఇంట్లో కొడుకు లేడు ఎటో బయటికి పోయినట్లున్నాడు, ఈ విషయం వాడికి తెలుసో లేదో, తెలువ కుండా ఎట్లుంటది, తెలిసే ఉంటది ఈ పాటికి ఎవరన్నా చెప్పే ఉంటరు, తెలిసినంకా ఇంటికి వచ్చి నన్ను అడిగితే ఏం చెప్పాలే, నీ జీవితం నేనే నాశనం చేసినారా అనాలనా, ఏం ముఖం బెట్టుకుని వాడి ముందర తేరుగాలే.......భయం, కోపం, ఆందోళన, వణుకు, నీరసం, ఆలోచనలు అన్ని రకాలుగా బూదవ్వకి తుఫాను సుడి గాలిలో చుట్టుకు పోయినట్లుంది ఏం చేయాలో తోచడం లేదు........బూదవ్వ ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుంది, వేసిన తలుపు మళ్ళి తెరుచుకోలేదు పొగ......పొగ......పొగ.........మంటలు... మూగ వేదనకి అంటుకున్న మంటలు, నిస్సహాయతకి అంటుకున్న మంటలు.......పొగ.....పొగా....కాలుతున్న నోట్ల వాసన, గది నుండి, గది బయట,ఊరంతా.......కాలుతున్న నోట్ల వాసన.......కాలుతున్న నోట్ల వాసన...

*****




అవినాశ్ పదోతరగతి చదువుతున్నాడు; ఆఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ స్టార్ట్ అయ్యి మూడు రోజులవుతూంది. ఆరోజు మాథ్స్ ఎగ్జామ్. స్టూడెంట్స్ అందరూ సీరియస్ గా ఎగ్జామ్ రాస్తున్నారు. అవినాశ్ ఫ్రెండ్ ఆకాశ్ కి పేపర్ చూసి ముచ్చెమటలు పట్టాయి. మాథ్స్ లో తను వీక్. మార్కులు తక్కువ వచ్చి తను ఫెయిల్ అయితే నాన్న వీపు చీరేస్తాడు. వెంటనే తన కాలర్ వెనుక దాచిన చీటి తీసి వడి వడిగా రాయసాగాడు. ఆకాశ్ ప్రక్కన రెండు సీట్ల తరువాత కూర్చున్న అవినాశ్ ఈ తతంగం అంతా చూస్తున్నా, ఎందుకు ఎగ్జామినర్ కి చెప్పడం, ఫ్రెండ్షిప్ దెబ్బతింటుంది అని మిన్నకుండిపోయాడు. ఆకాశ్ బార్డర్ మార్కులతో గట్టెక్కాడు.

*************

రోజులు వడి వడిగా సాగిపోయాయి. ఫైనల్ ఎగ్జామ్స్ స్టార్ట్ అయినాయి. ఒకరోజు సాయంత్రం, “ అనన్యా , ఏంటే గోడల నిండా క్రేయాన్స్ తో ఆ పిచ్చి గీతలు?” అరవసాగింది అవినాశ్ వాళ్ళ అమ్మ. అనన్య, అవినాశ్ చెల్లి; LKG చదువుతూంది. ఇద్దరి మధ్య గాప్ పది సంవత్సరాలు ఉండడంతో చాల గారాబంగా పెరిగింది. “ ఒరేయ్ అవినాశ్ నువ్వు పెద్దవాడివి చూస్తూ అలా

కూర్చున్నావేరా? చెప్పాలి కదా అది గీతలు గీస్తుందని. రేపొద్దున్న మనం కొత్తింట్లోకి వెళ్ళినా అది అలానే గీస్తుంది కదా; మళ్ళీ రంగులు వేయాలంటే ఎంత ఖర్చు, "తప్పు చేయడమే కాదురా, చూస్తూ చెప్పకుండా ఉండడం కూడా తప్పే". 'సారీ మమ్మీ' చెప్పాడు అవినాశ్.

ఇంతలో ఈరోజు మాథ్స్ ఎగ్జామ్ కదా, ఆకాశ్ ఎలా రాసాడో కనుక్కుందాం అని ఫోన్ చేసాడు అవినాశ్. పదోతరగతి కావడం వల్ల ఇద్దరూ వేరు, వేరు సెంటర్లలో ఎగ్జామ్స్ రాసారు. ఫోన్ అవతలి వైపు నుంచి ఒకటే ఏడుపు. ఈ రోజు కూడా చీటీ తీసి కాపి కొడుతుంటే ఎగ్జామినర్ పట్టుకుని డిబార్ చేసాడ్రా. ఒక సంవత్సరం వేస్ట్ అయినట్లే, మా నాన్నకు తెలిస్తే చంపేస్తాడు, ఏడవసాగాడు ఆకాశ్. వెంటనే అవినాశ్ కి తల్లి అన్న మాటలు గుర్తొచ్చాయి. 'తప్పు చేయడమే కాదు, చూసి చెప్పకపోవడం కూడా తప్పే'. ఆరోజు తను వాడు ఆఫ్ ఇయర్లీ ఎగ్జామ్‌లో కాపి కొడుతుంటే, సర్ కి చెప్పుంటే గట్టిగా దండించేవారు. ఇంట్లో వాళ్ళ నాన్న కూడా శ్రద్ధగా చదివించేవారు. అప్పుడు వాడు కష్టపడి చదివి, కాపి కొట్టకుండా పాస్ అయ్యేవాడు. జరిగినదాంట్లో తన తప్పు కూడా ఉంది అని తనలో తను కుమిలి పోయాడు అవినాశ్.




ఆరోజు..నవంబర్ పద్దెనిమిది..రెండువేల పదహారు..నల్ల కుబేరుల..తద్దిన దినం. "     సమయం రాత్రి ఎనిమిది. నెలల తరబడి జీతాలు రాకపోయినా..దేశం మొత్తం ఆర్ధికమాంద్యంతో అల్లాడి పోయినా..లంచాల రొచ్చులో..ముప్పెత్తుకుంటూ విలాస జీవితాన్ని

గడిపేయగల యుడీసి జానకిరాం.. త్రీ బెడ్ రూం ఫ్లాటది . పెళపెళలాడే లంచాల డబ్బుతో    సిగ్గూశరంలేని తళతళలాడే ముఖంతో రోజూ ఇంట్లోకి అడుగు పెట్టే..భర్త ..సర్జికల్ స్ట్రోకుతో    చావు దెబ్బ తిన్న పాకిస్తాన్ లా    పెద్ద నోట్ల రద్దుతో.. పీక్కు పోయిన ముఖంతో జీవచ్ఛవంలా వచ్చినా గమనించని అర్ధాంగి..ధనలక్ష్మి

“ఏమండీ ఇవ్వాళో వింత జరిగి పోయింది.. అది విన్నారంటే త్రిల్లయి పోతారు. అదేంటో అడగరే..? ప్రతి రోజూ ఇంట్రావర్టని..ముంగని ఆడిపోసుకుంటారే..మన బాబీగాడు యివ్వాళేం చేశాడో తెలుసా?    స్కూలునుంచి రాగానే యాంకరై పోయాడు. వాడి యాంకరింగ్ ముందు..యిటు సుమ అటు ప్రదీప్ కూడా బలాదూరంటే నమ్మండి.స్కూల్నుంచి వస్తూనే సెల్ మైకులా చేత్తో పట్టుకొని..దాదాపు వంద ప్రశ్నలడిగి సమాధానాలు రికార్డు చేసుకున్నాడు. వాడడిగిన ప్రశ్నలన్నీ మీ గురించి.. మీ సంపాదన .. మన ఖర్చుల గురించే. రేపు స్కూల్లో లెటర్ రైటింగులో ఏదో అసైన్ మెంటు సబ్మిట్ చేయాలట.”

నాన్ స్టాపుగ చెప్పుకు పోతున్న భార్య వంక అభావంగా చూసిన జానకిరాంకి అందులో ఒక్క ముక్కా అర్ధం కాక పోయినా మీ సంపాదన మన ఖర్చుల గురించే నన్న మాట బుర్రలోకి ఎక్కి పోయింది. తల విదిలించి తడబడి పోయాడు.

“ఆ ..ఏమన్నావ్.. ?నా సంపాదనా ఖర్చుల గురించా ? ..ఇంతకూ మన బాబీ ఎక్కడా?” “వాడు ఏడుగంటలకే భోంచేసి..ఏదో లెటర్ రాసుకోవాలని చెప్పి    తన బెడ్ రూంలో దూరి పోయాడు. మన శాన్విని కూడా రావద్దని వార్నింగిచ్చాడు. ఔనూ.. మీరేంటి అలావున్నారు..కాఫీ యిమ్మంటారా..ప్రషప్పయి..డిన్నర్ చేస్తారా?

“ఏం లేదు గానీ .. ఎందుకో ఆకలిగా లేదు..భోజనం చేయను..ఓ గ్లాసు మజ్జిగ చాలు.”

“పోనీ కొంచెం ఉప్మా చెయ్యమంటారా.?

“వద్దు ధనా..బటర్మిల్క్ చాలు.” సోఫాలో కూలబడి పోయాడు. కొడుకు చేసిన ఘనకార్యాన్నే నెమరేసుకుంటూ..మరో లోకంలో విహరిస్తున్న ధనలక్ష్మి..కిచెన్ లోకి జంపై పోయిందే తప్ప భర్తలో ముఖంలో తొంగి చూస్తున్న చావు కళను గమనించలేక పోయింది.

******

సమయం పన్నెండైంది. పది రోజుల నరక యాతన..పరాకాష్టకు చేరిపోయిందన్నట్లు..కునుకుకు కూడా దూరమైన కళ్లు రెండూ పేలిపోతాయన్న ఫీలింగ్ తో బాటు ..డబ్ డబ్ ల గుండెలను చేత్తో అదుముకుంటూ..నల్ల పిల్లిలా లేచి.. మూడో బెడ్ రూం లోకి అడుగు పెట్టాడు. తన మనసు లాగే అంధకారం వ్యాపించి పోయి అర్ధ రాత్రి భయోత్పాతాన్ని రేకెత్తించే స్మశాన వాటికలా కనిపించింది. తడుముకుంటూ లైట్ ఆన్ చేశాడు. తన అవినీతికి అంతిమస్థానం లంచాల మనీకి రహస్య స్థావరం..జెయింట్ కాట్ ఆహ్వానం పలికింది.తలుపు మూసి సీక్రెట్ కోడ్ నెంబరును కాట్ లో కలిసి పోయినట్లున్న లాకర్ కు ఫీడ్ చేశాడు. ఎలాంటి శబ్దమూ లేకుండా బెడ్ పార్టంతా ఓపెనై పోయింది. క్రిక్కిరిసి పోయిన..శవాల్లా కనిపించాయి ప్రాణాలు కోల్పోయిన వెయ్యి రూపాయల నోట్లు. దాదాపు పది కోట్ల పైమాటే. ఏడ్చేయాలనిపించింది. ఇంకా నేనెందుక బ్రతికున్నా నా..అన్న స్మశాన వైరాగ్యం..కమ్మేసింది..కారు మబ్బులా. ఇంత కాలం ఇంతమంది ఉసురు పోలుకుని..ఇలాంటి నీచమైన బ్రతుకు బ్రతికి..చివరకు సాధించింది ఇంతేనా అనిపించింది...క్షణంసేపు. మురిగి పోయిన శవాల్లా ఆ పెద్ద నోట్లు..శవ పేటికలా ఆ కాట్ తట్టుకోలేక బావురుమన్నాడు జానకిరాం. పది రోజుల తన మానసిక వేదనకు ఏడుపే దిక్కని ఫీలయ్యాడు. ఆదే ఆఖరి స్పర్శ అన్నట్లు కరన్సీని తడిమి చూసుకున్నాడు. కట్టలు తెంచుకున్న దుఃఖాన్ని ఆపుకోలేక విలవిల లాడిపోయాడు. తన ముందు లంచాలివ్వలేక ఏడ్చేసిన ఎందరో అభాగ్యుల..ముఖాలు అపహాస్యం చేస్తున్నట్లు.. వెక్కిరిస్తున్నట్లు విలయ తాండవం చేస్తుంటే..శవ పేటిక క్లోజ్ చేసి కాట్ మీద ఒరిగి పోయి కళ్లు మూసుకున్నాడు.

దాదాపు గంట సమయం గడిచి పోయింది. ఏదో నిర్ణయానికొచ్చినట్లు లేచి లైటు ఆఫ్ చేసి లాక్ చేసి తన బెడ్ రూం వైపు కదులుతుంటే బాబీ రూం వెలుగుతున్న లైటు చూసి ఆశ్చర్య పోయాడు. బెడ్ లైటున్నా నిద్ర పోని బాబీ మనస్తత్వం ఫ్లాషై కొడుకు రూం లోకి తొంగి చూశాడు.

ఓ మంచం మీద బాబీ..మరో కాట్ మీద కూతురు శాన్వీ గాఢ నిద్ర లో..కనిపించారు. బాబీ రీడింగ్ టేబుల్ మీద బుక్ క్రింద..రెపరెప లాడుతున్న పేపర్ జానకిరాం దృష్టి నాకర్షించింది. వణికే చేతులతో పేపర్ తీసుకుని చదివాడు. ఆఖరి వాక్యం పూర్తిచేయకుండానే గుండె కలుక్కుమంది. లైటార్పి తన బెడ్ రూంలోకి వచ్చేశాడు. అప్పటికే లేచి కూర్చున్న ధనలక్ష్మి భర్త వాలకాన్ని చూస్తూనే గాబరాగా లేచొచ్చి ..

"ఏమైంది.? .ఎక్కడికెళ్లారు.? .చేతిలో ఆ పేపరేంటి..? మంచినీళ్లు ఇక్కడే వున్నాయి..మరి" అంటూ ఆతృతగ అడుగుతున్న భార్యను అదోలా చూస్తూ తన చేతిలోని పేపర్ మౌనంగా అందించాడు. అదురుతున్న గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ చదవడం మొదలు పెట్టింది. పేరా పూర్తవుతూనే అది కొడుకు తండ్రికి రాసిన ప్రేమ లేఖ కాదని అర్థమై పోయింది. స్కూలు అసైన్ మెంటు కూడా కాదని కన్ ఫం అయిపోయింది . అక్షరాలవెంట..అయోమయంగా పరుగులు పెట్టింది.

"డియర్ డాడీ.! నన్ను ఎక్స్ క్యూజ్ చేయండి. నా మైండ్ ను బ్రేక్ చేస్తున్న మేటర్ మీతో షేర్ చేసుకోవాలని ఈ లెటర్ రాస్తున్నా. మార్నింగ్ స్కూల్ బస్..దిగుతుండగానే మా బస్ డ్రైవర్ సాదిక్ వచ్చి నా స్కూల్ మేట్స్ అందరి ముందు..రాకేష్ బాబూ!..మాదీ

నాన్న మీ డాడీ డిపార్ట్ మెంటులోనే డ్రైవర్ గా రిటైర్ అయ్యిండు. ఆయన్కి పెన్షన్ గాట్యుటీ ఇంకా సెటిల్ కాలేదు. మీదీ డాడీ గార్ని అడిగితే పైసల్ తెమ్మన్నారంట. మాదీ గరీబు పేమిలీ. మేము లంచాలు యిచ్చుకో లేం. మీదీ డాడీకి చెప్పున్రి బాబూ..మాదీ డాడీ పెన్ సన్ అచ్చినంక నేనే తెచ్చి తమకు యిస్తాను .

జరిగింది వెరీ స్మాల్..బట్ లంచ్ బ్రేక్కల్లా రియల్ పిక్చర్ స్టార్టై పోయింది...నన్ను చూసిన నా కలిగ్స్ంతా ..లంజాకో.. అంటుంటే.. అర్ధం కాలేదు. తర్వాత వెలిగాయ లైట్లు..డాడీ..దాని ఫుల్ ఫాం..లంచగొండి జానకరాం కొడుకని. లాస్ట్ మంత్ ఇలాంటి సిట్యుయేషన్ లోనే ఐమీన్ వాళ్ల డాడీని ఎసిబి ట్రాప్ చేసి ..అరెస్ట చేశారని మా స్కూల్ స్టూడెంటు స్కూల్ బస్ లోంచి దూకి సూయ్ సైడ్ చేసుకున్నాడు. నాతో బాటు శాన్వీ వుండడంతో..నేనీ పని చేయలేక పోయాను . ఐ స్వేరిట్. ఇదే విషయం రేపు స్కూల్లో వైల్డ్ ఫైరై పోతుంది. స్టాఫ్ మెంబర్స్ తోబాటు..అటెండర్స్ క్కూడా నేను లోకువై పోతాను ..రాకేష ప్లేస్ లో మీ చెత్త నేమ్ తో బాటు నా నేమ్ కూడా..ఫౌండేషన్ స్టోన్ లా పర్మినెంటై పోతుంది. హౌకెనై కంటిన్యూ ఇన్ ద సేమ్ స్కూల్.?

మీకూ నాకే కాదు..తరతరాలకు ఆ మచ్చ అలాగే కంటిన్యూ అవుతుంది. సాయంత్రం మమ్మీ చెప్పింది..మీ సంపాదనంతా మాకోసమేనని . మాచదువులు కోసమేనని ఈ లంచాలు ..ఈ నికృష్ట ఎర్నింగ్స్ మేము కోరుకున్నామా డాడీ? .మా బస్ డ్రైవర్ డాడీ లాంటి పూర్ పీపుల్స్ ని టార్చర్ చేసి సంపాదిస్తే మనం డెవలప్పయి పోతామా? మేము పోష్ లొకాలిటీలో ప్లాటు.. కార్పొరేట్ స్కూల్స్ లో సీటు.. అడిగామా డాడీ.? కార్లూ మల్టి ప్లెక్సుల్లో మూవీస్ అడిగామా.? మీరు మీతోబాటు ఇద్దరు బాబాయిలు ఏ కార్పొరేట్ స్కూల్లో చదివారు? మొన్న హాలిడేసులో తాతయ్య గారి ఊరెళ్లినప్పుడు..మీరు చదివిన గవర్నమెంట్ స్కూల్ చూశాను. బిగ్ ప్లేసు.. ఫెంటాస్టిక్ ప్లే గ్రౌండ్.ఆల్ ఆర్ ట్రైయిండ్ టీచర్స్. నేనూ చెల్లి ఆ స్కూల్లోనే స్టడీ చేస్తాం. మేం ఊరెళ్లిపోతే మిగిలేది మీరూ మమ్మీ..త్రీ బెడరూం ఫ్లాటు అవసరమా? లంచాలు తీసుకోకుండా..లైఫ్ లీడ్ చేయ లేరా? .మీరెంత మనీ బ్రైబ్ గా ఎర్న్ చేశారో నాకు తెలీదు. మీ లాంటి కరప్ట్స్..దేశాన్ని లూటీ చేసిన దొంగలేగా మోడీ అంకుల్ బ్లాక్ మనీని టార్గెట్ చేస్తూ చేసిన సర్జికల్ స్ట్రైక్ కు ప్రాణాలు పోయినట్లు షాట్ చేస్తోంది? మీ దగ్గరా యిలాంటి డర్టీ కరెన్సీ వుంటే..గవర్నమెంటుకు సరండర్ చేయండి.లంచాలు లేకుండా జాబ్ చేయలేకపోతే తాతయ్య గారి వూరొచ్చి వ్యవసాయంచేయండి. రేపు మార్నింగే నేనూ శాన్వీ బస్ లో తాత గారి విలేజ్ కి వెళ్లి పోతున్నాం. రేపు స్కూల్లో శాన్వీని" లంజాకూ "అని బనాయిస్తే అది డెఫినెట్ గా సూయ్ సైడ్ కమిట్ చేసుకుంటుంది.

బై డాడీ..ఫైనల్ గా మై హంబుల్ రిక్వెస్ట్..మేం బయటి కెళ్లే లోగా ..మీ ముఖం మాకు చూపించకండి..గుడ్ నైట్ అండ్ గుడ్ బై డాడీ."

******

కట్టలు తెంచుకున్న కన్నీటిని కట్టడి చేయలేని ధనలక్ష్మి కొంగుతో కన్నీరు ఒత్తుకుంటూ జనకిరాం ను అల్లుకుపోయింది. “లక్ష్మీ! ..చూశావా? మన బాబీ ఏంరాశాడో ..నా ముఖం చూపించొద్దన్నాడు. ఈ అవమానం కంటే చచ్చిపోవడమే మంచిదని పిస్తోంది. నిజమే నేను గడ్డి తినే సంపాదించాను.లంచగొండి నయ్యాను.ఇదంతా చేసింది నేను కట్టుకు పోవడానికా..కాదుగదా..వాడేం రాశాడో చూశావుగా?” ఏడుపుతో మాటలు రాక భార్యను చుట్టుకు పోయాడు..లంచగొండి జానకిరాం.

“అయిందేదో అయిపోయింది. టెన్షన్ కాకండి.బాబీ మిమ్మల్ని ముఖం చూపించొద్దని రాసినా వాడే ఏంచేయాలో రాశాడు. అదే చేయండి.”

“మరీ పిచ్చిదానిలా మాట్లాడకు..పది కోట్లంటే మాటలుకాదు..” లంచావతారం మళ్ళీ ఆక్రమించేశాడు..జానకిరాంని .. కుక్క బుద్ధిలా .“మరీ పిచ్చి పట్టినట్లు..మాట్లాడకండి.నిజం చెప్పాలంటే బాబీ చెప్పిందే కరక్ట్. నేను కూడా ఇప్పటి వరకు మీతో బాటు తిన్నది ఇంత నీచమైన ..లంచాల రక్తపు కూడని తెలుసుకోలేక పోయాను. లగ్జరీలమోజులో.. ఆడంబరాల అతిశయంతో కళ్లుమూసుకుపోయి ప్రవర్తించాను..పిల్లల్ని పెంచాను. బాబీ కొట్టిన చెప్పు దెబ్బతో నా తప్పేంటో తెలుసు కున్నాను.నాకు నా పిల్లలుకావాలి..మీరు సంపాదించిన లంచాలు..కోట్లాది పాపపు సొమ్ము..మీరే కట్టుకు పొండి .నేను కూడా బాబీ శాన్విలతో..బయలుదేరి పోతున్నాను.బాబీ చెప్పిన మాటే నేనూ చెపుతున్నాను..

గుడ్ బై.

హఠాత్తుగా భర్తను నెట్టేసి లేచిన ధనలక్ష్మి పిల్లల బెడ్ రూంలోకెళ్లి డోర్ లాక్ చేసేసుకుంది. స్మశానంలో శవాల్ని దహనం చేసే కాటికాపరి లాగా..ఆ గదిలో మిగిలి పోయాడు..లంచాల జానకిరాం. ఆలి పోయింది..ఆస్తిపోయింది..బిడ్డలు..దూరమై పోయారు. ఆస్తిని వెల్లడించి..డిపార్ట్ మెంటుకు దొరికి పోతే ? పేరూ..పేరుతో బాటు ప్రమోషన్ నాశనం. శవం చుట్టూ మూగుతున్న రాబందుల్లా ఆలోచనలు చుట్టుముడుతుంటే.. చితి మీద కట్టెలా..కాలి పోతున్న బాధ కమ్మేస్తుంటే పెద్దనోట్ల రద్దు మీద కసితో కాలి పోయాడే తప్ప కనీసం బార్యా పుత్రుల సలహాను.. స్వీకరిస్తే బ్రతుకు బాగుపడుతుందేమో నన్న..ఇంగిత జ్ఞానాన్ని కూడా ..విస్మరించాడు. “లంచగొండి జానకిరాం.”

“పుట్టుకతో వచ్చిన బుద్ధులు ..పుల్లలతో గాని పోవేమో ?”




యధావిధిగా నేను రాంబాబు వాకింగ్ కి బయలుదేరాం.

రామాలయం దాటి మరో వీధిలోకి మలుపు తిరిగామో లేదో ; అక్కడ ఒక ఇంటి ముందు జనాన్ని చూసి రాంబాబు అవాక్కయ్యాడు. “అరె!పాపం పరంధామయ్య పోయినట్లుందే?...పద చూసొద్దామ"ని అటు నడిచాడు.

"ఏమయింది?" అన్నాను నేను కంగారుగా.

"ఆయనా; నేనూ నిన్న బ్యాంక్కెళ్ళాం అయిదు వందల నోట్లు మార్చుకోవడానికి. అక్కడ క్యూలో నిల్చోలేక కళ్ళు తిరిగి పడిపోయాడు. హాస్పిటల్ కి తీసుకెళ్ళారు. పాపం! చనిపోయినట్లున్నాడు." అన్నాడు రాంబాబు.

ఇంటికి సమీపించేకొద్దీ ఆ ఏడుపులు; పెడబొబ్బలు వినిపించేసరికి రాంబాబు వూహించింది నిజమే అయింది. పరంధామయ్య

ఎంతో సౌమ్యుడు. మృదుస్వభావి. అప్పుడప్పుడు మాతోపాటు వాకింగ్ వచ్చేవాడు. రెవెన్యూ లో చేసి రిటైరయ్యాడు. ఇంకో కూతురు పెళ్ళికి ఉంది. చిన్నబ్బాయి ఇంకా సెటిల్ కాలేదు. ఎప్పుడూ వీళ్ళిద్దరి గురించే దిగులు పడేవాడు. బి.పి; షుగర్ వుంది. దానికి తోడు హార్ట్ ప్రాబ్లెం. గంటల తరబడి క్యూలో నిలబడే సరికి కళ్ళు తిరిగి పడిపోయాడట. వెంటనే హాస్పిటల్ కి తీసుకు పోయినా ప్రయోజనం లేకపోయింది. దారిలోనే ప్రాణం పోయింది.

"ఒక ఇంటర్వ్యూ ఒకటుంటే వెళ్ళొచ్చాను అంకుల్. వచ్చేసరికి ఇలా అయిపోయింది." భోరున ఏడ్చాడు చిన్నాడు.
"ఈ పెద్ద నోట్ల రద్దు ఇంకెంత ప్రాణాల్ని తీస్తుందో.....!" నిట్టూర్చాడు రాంబాబు. .

"ఇది నిజంగా విచారకరమే." అన్నాను.

ఈ సంఘటన మరువక ముందే మర్నాడు రామయ్య పొలం వైపు పోతూ పలకరించాడు.

"ఏం! రామయ్యా! ఎంత వరకు వచ్చాయి పెళ్ళి పనులు" విచారించాను.

'ఏం పెళ్ళి పనులో బాబూ! గొప్ప ఇబ్బంది పెట్టేస్తున్నారు బ్యాంకు వాళ్ళు." అన్నాడు నిర్లిప్తంగా.

"ఏమంటున్నారేమిటి?"

"హెడ్డాఫీస్ పర్మిషన్ కావాలంట. బిల్లులు గావాలంట. డబ్బు వాళ్ళకే ఇస్తారంట...ఇంకా ఏమేమో కండిషన్లు పెడుతున్నారు. ఇంకో వారంలో పెళ్ళి. ఆ లోపల చేతికి డబ్బులొస్తాయో..రావో తెలియడం లేదు" వాపోయాడు రామయ్య.

"వస్తాయిలే దిగులు పడకు. నీ డబ్బులు నీకివ్వడానికి ఏముంది?" ధైర్యం చెప్పాను.

"దేవుడెలా రాసి ఉంటే అలా అవ్వుద్ది. వస్తాను బాబూ!" అంటూ పొలం వైపు దారి తీశాడు నిరాశగా. మేము ముందుకు కదిలాము.

“ సామాన్యుల పెళ్ళిళ్ళు సైతం ఆగిపోతున్నాయంటే ఏమనాలి? పెళ్ళి కోసం దాచుకున్న డబ్బులు తీసుకోవడానికి కూడా సవాలక్ష ఆంక్షలు. వారు నిజంగా నరకం అనుభవిస్తున్నారు. మన అవసరానికి మన డబ్బులు మనం తీసుకోవడానికే వీలు కాకపోతే ఇక బ్యాంకులెందుకు? ఇలా చేస్తే బ్యాంకుల పైన నమ్మకం ఉంటుందా? ఇక మీదట ఎవరైన బ్యాంకుల్లో దాచుకుంటారా? కానీ...కుబేరుల పెళ్ళిళ్ళు మాత్రం ఆగడం లేదు. వాయిదా పడడం లేదు. అవి మాత్రం అట్టహాసంగా జరిగి పోతున్నాయి. సామాన్యులకు ఒక న్యాయం? కుబేరులకు మరో న్యాయం? కష్టాలంతా సామాన్యులకు...సుఖాలంతా కుబేరులకు. బాగుంది కదా!" అన్నాడు రాంబాబు నడుస్తూ.

ఒక నిట్టూర్పు విడిచి మళ్ళీ ప్రారంభించాడు. “ మొన్న పేపర్లో చూసుంటారు... ఒక రైతు భార్య పొలం అమ్మిన డబ్బు యాభై లక్షలు మారవేమోనని ఆత్మహత్య చేసుకుంది. ఏమిటీ దౌర్భాగ్యం? ఎటుపోతున్నాం మనం?"

"అవును. అది మరో విషాదకరం! ఆమె తొందర పడింది." అన్నాన్నేను.

"ఏమిటి? మూర్తిగారూ! అలా అంటారు? ఒక్క సారిగా పెద్ద నోట్లంతా చిత్తు కాగితాలయిపోతాయని సాక్షాత్తు ప్రధాన మంత్రి ప్రకటిస్తే గుండెలొకసారిగా ఆగిపోవా?... వాటి గురించి ఎవరైనా ఆలోచించారా?"

"నిజమే! వాటిని మార్చుకునే అవకాశం వుందని ప్రజలలో అవగాహన కలిగించాల్సింది."

"ఇప్పుడు పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా? దీనికి ఎవరు బాధ్యులు?" రాంబాబు ఆవేశానికి అర్థముంది.

అలా మాట్లాడుకుంటూనే బ్యాంక్ దగ్గరికి వచ్చేశాం.

"అక్కడ చూడండి... చూడండి! ఆ పోలీసోడు వాళ్ళను ఎలా చావ బాదుతున్నాడో..." అన్నాడు రాంబాబు అటు చూ పిస్తూ .

అటు చూసే సరికి ఒక పోలీసోడు క్యూలో వున్న వారిని విచక్షణా రహితంగా చావ బాదుతున్నాడు. వృద్ధులు; స్త్రీలు; పసి పిల్లల తల్లులు; రోగులు ఎవర్నీ వదలడం లేదు. గాయాలయి పడి పోయినా వదలడం లేదు. వాడికి అంత కోపం ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు.

దగ్గరికి వెళ్ళి "ఎందుకయ్యా? అలా బాదుతున్నావు?" అని అడిగాం.

"మీకెందుకూ? ఎళ్ళండెహె?" అన్నాడు విసురుగా.

అంతలోనే ఒక విలేకరి కెమెరాతో అటు వచ్చాడు. ఓ అయిదారు మంది యువకులు మా వెనక నిలబడే సరికి వెనక్కి తగ్గాడు.

"వాళ్ళు దేశ ద్రోహులో...ఆటంక వాదులో కాదు. మీ తల్లో; తండ్రో; అన్నో; అక్కో ఇలాంటి నోట్లతో వేరే బ్యాంక్ ముందు నిలబడి ఉంటారు... అది గుర్తుంచుకో? " అని వార్నింగిచ్చాడు రాంబాబు.

"వీడిని ఇలా వదల కూడదు సార్? కంప్లైంట్ ఇద్దామ"ని యువకులు ఆవేశ పడ్డారు.

"తప్పయింది సార్" అని వాడు కాళ్ళా వేళ్ళా పడే సరికి హెచ్చరించి వదిలేసాం. "చూశావా మూర్తీ! మన డబ్బులు మనం తీసుకోవడానికి పోలీస్ దెబ్బలు తినాల్సిన దుస్థితి వచ్చింది. అసలు బ్రిటీష్ హయాంలో కూడా ఇంతటి అఘాయిత్యం జరగ లేదేమో?" ఆవేశంగా చెప్పుకు పోతున్నాడు రాంబాబు.

"సరిగ్గా చెప్పారు సార్! మన అవసరానికి పనికొస్తుందని బ్యాంకులో దాచుకుంటే ...మన డబ్బులు మనం తీసుకోవడానికి రోడ్లో నిలబడాల్సివచ్చింది. మొన్నటికి మొన్న దహన సంస్కారానికి డబ్బుల కోసం సి ఎం ఫోన్ చేయాల్సి వచ్చింది. వ్యవసాయం కుప్ప కూలిపోయింది. చిల్లర లేక చిన్న చితక వ్యాపారాలు చితికి పోయాయి. ప్రజలు రోడ్ల మీదున్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయి పోతోంది. అయినా ప్రభుత్వాలు పట్టింపులకు పోతోంది. పరిష్కారం దిశగా ఆలోచించడం లేదు." వాపోయాడు ఒక యువకుడు.

"బాగా చెప్పావు బాబూ! నీకున్న తెలివి తేటలు కూడా ప్రభుత్వ పెద్దలకు లేక పోయింది. ఇంత పెద్ద దేశంలో ప్రధానికి ఆర్థిక వేత్తలు; మేధావులు; ఉన్నతోద్యోగులు; సలహా దారులు కరువయ్యారా? వారికి ఈ గ్రౌండ్ రియాల్టిస్ తెలియవను కోవాలా? ఒక సాహసోపేతమయిన నిర్ణయం తీసుకునేటప్పుడు సలహాలు; సంప్రదింపులు జరప లేదా? సమిష్టి నిర్ణయమయితే ఇంత అనాలోచితంగా తీసుకున్నారా? ఏక వ్యక్తి నిర్ణయమా? ఒంటెద్దు పోకడా? సరే..అయిందేదో అయిందనుకుందాం. ఇప్పటికైనా అందరిని సంప్రదించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం కనుగొన వచ్చు గదా?" అన్నాడు ఆవేశంగా.

ఈ డీమోనిటైజేషన్ చేసిన మరుసటి రోజు సాయంత్రం వాకింగ్ లో రాంబాబు నా అభిప్రాయం అడిగాడు. అప్పుడు నా అభిప్రాయం చెపుతూ - "ఇది చాలా సాహసోపేతమయిన నిర్ణయం. ఏ రాజకీయ నాయకుడు వూహించనటువంటి చాలా కఠినమయిన నిర్ణయం. ఒక్క దెబ్బతో నల్ల కుబేరుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించే నిర్ణయం. ఈ దెబ్బతో కోట్లు; కోట్లు గా మూలుగుతున్న నల్ల ధనం బయటికి రాక తప్పదు. ఒక వేళ రాకపోతే చిత్తు కాగితాలు కాక తప్పదు." అన్నాను ఉత్సాహంగా.

నాకెందుకో ఈ నిర్ణయం తెగ నచ్చేసింది. మనస్పూర్తిగానే స్వాగతించాను. కాక పోతే ఈ ఉక్కు సంకల్పం అనుకున్నది సాధించే వరకు సడల కూడదని భావించాను. వారం, పది రోజుల్లో అంతా సర్దుకుంటుందని వాదించాను. నా అభిప్రాయంతో రాంబాబు విభేదించాడు. నల్ల ధనం నిర్మూలించడం అనేది వారం; పది రోజుల్లో అయ్యే పని కాదన్నాడు. ఇప్పుడు ఈ సామాన్యుల కష్టాలు చూసి నాపైన పైచేయి సాధించినట్లు భావిస్తున్నాడు. అందుకే అతని ఆక్రోశాన్ని నాపైన చూపుతున్నాడు.

"నల్ల ధనం ఏమో గానీ...నల్ల కుబేరులు బాగున్నారు. సామాన్యులు సచ్చి పోతున్నారు." అంటూ అటు వెళ్ళిపోయాడు విలేకరి. మేము మా దారి పట్టాం.

" అసలు నల్లకుబేరులంటే ఎవరనుకున్నావు? వాళ్ళల్లో ఎక్కువ మంది రాజకీయ నాయకులు; బడా బడా వ్యాపార్లు; కంట్రాక్టర్లు; రియల్ ఎస్టేట్ వ్యాపార్లు; పారిశ్రామిక వేత్తలు, సినిమా వాళ్ళు. వాళ్ళను వదిలేసి జనం పైన పడడం ఎంత వరకు సబబు? అవినీతి పెరిగి పోయి వ్యవస్థలు భ్రష్టు పట్టి పోవడానికి అసలు కారణం ఎవరనుకున్నావు? "

"అందుకే చాలా తెలివిగా ముందస్తు సమాచారం లేకుండా పెద్ద నోట్లు రద్దు చేసి వీళ్ళకంతా ప్రాణ వాయువు లేకుండా చేశారు. తేలు కుట్టిన దొంగల్లా కక్క లేక; మింగ లేక గిల గిల కొట్టుకు చస్తున్నారు బడా బాబులు?" అన్నాను ఆవేశంగా.

"అమాయకుడా! నువ్వలా అనుకుంటున్నావు కానీ...వాళ్ళెప్పుడో సర్దుకుని ఉంటారు."

"అలా అవడానికి వీల్లేదు రాంబాబు గారూ! ఇది అకస్మాతుగా ప్రకటించిన నిర్ణయం. ఎవరికీ తెలిసే అవకాశమే లేదు. ప్రధాన మంత్రి చిత్త శుద్ధిని మనం శంకించ లేము "

"ఇక్కడ శంకించాల్సింది మన చిత్త శుద్ధిని కాదు; నల్ల కుబేరుల చెత్త బుద్ధిని. శత కోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్టు వారి తెలివి తేటలు అనంతం. వాటిని తక్కువ అంచనా వేయ లేం."

"ఎంత తెలివి తేటలున్నా ఈసారి తప్పించుకోవడం అంత సులువు కాదు." అన్నాను ధృఢంగా.

"ఇప్పటికే దార్లు కనిపిస్తున్నాయి. నార్త్ ఈస్ట్ స్టేట్ లలో ఉన్న ప్రత్యేక అవకాశాల్ని ఉపయోగించుకుని బ్లాక్; వైట్ అయి పోతున్నట్లు వార్తలొస్తున్నాయి. చాలా కాలేజ్ లు పిల్లలకి స్కాలర్షిప్ లిచ్చేస్తున్నాయి. ఉద్యోగులకు ముందు గానే రెండు; మూన్నెళ్ళ జీతాలిచ్చేస్తున్నాయి. వాళ్ళకు తెలియకుండానే అక్కౌంట్లోకి వేలకు వేలు జమ అయి పోతున్నాయి."

" పిల్లలకి స్కాలర్షిప్పులు: ఉద్యోగులకు జీతాలు ముందుగానే అందుతున్నాయంటే మంచిదే కదా! ఇంకో గుడ్ న్యూస్ చెప్పనా? ఎన్నో ఏళ్ళుగా బకాయిపడి ఆగి పోయిన ప్రాపర్టీ ట్యాక్స్ కోట్లు; కోట్లు వసూలవుతున్నాయట. బ్యాంకులకు మొండి బాకీలు వసూలవుతున్నాయట. వసూళ్ళ కోసం తిరిగి తిరిగి వేసారి పోయిన ఉద్యోగులు; ఇప్పుడు సంబర పడి పోతున్నారట." కుతూహలంగా చెప్పాను.

"అలా జరిగితే మంచిదే కానీ... బాణం గురి తప్పింది. నల్ల కుబేరులను వదిలేసి సామాన్య పౌరులకు తగిలింది. వారు విల విల్లాడి పోతున్నారు.   ఇప్పుడు ఆ నల్ల కుబేరుల దృష్టి బడుగు; బలహీన వర్గాల పైన పడింది. బతిమాలో; బామాలో వాళ్ళ ఖాతాల్లో జమ చేసేస్తున్నారట. జీరో బ్యాలన్స్ తో ఓపెన్ అయిన అక్కౌంట్స్ ఇప్పుడు కోట్లలో మూలుగుతున్నాయట.   ఇంకం ట్యాక్స్ వాళ్ళు నోటీస్ లిస్తున్నారు. రెవెన్యు వాళ్ళు మరో పక్క సంక్షేమ పథకాలకి తూట్లు పొడుస్తారట. పాపం పేదలు బలయి పోతున్నారు.”

"అలా జరగదులెండి."

"జరగదనడానికి వీల్లేదు మూర్తీ!   అమాయకులు అల్లాడి పోతున్నారు?"

"ఇవన్నీ తాత్కాలికమే రాంబాబు గారూ! అన్నీ త్వరలోనే సర్దుకుంటుంది. ఇంత పెద్ద సంస్కరణ తేవాలంటే కొన్ని కొన్ని ఇబ్బందులు తప్పవు. ఒక్క సారి నల్ల ధనం బయటి కొచ్చేస్తే దాని ఫలితాలు అనంతం. దీర్ఘ కాలికం కూడా."

"అలా అని సామాన్య పౌరులను క్యూలలో నిల బెడతారా? ఎందరో బడుగు; బలహీన వర్గాలు పనులు మానుకొని క్యూలో నిలబడుతున్నారు. ఉత్త పుణ్యానికి...వృద్ధులు రాలి పోతున్నారు. యువకులు పోలీస్ దెబ్బలు తింటున్నారు. రైతులు ఆందోళనలో ఉన్నారు. చిన్నా చితకా వ్యాపారులు రోడ్ల మీద పడ్డారు. ఇంట్లో ఎలకలున్నాయని ఇల్లు తగల బెట్టు కుంటామా? ఏ రెండు శాతమో; మూడు శాతమో వున్న నల్ల కుబేరుల కోసం తొంభై ఏడు శాతం ప్రజల్ని ఇబ్బంది పెడతారా? దేశాన్ని సంక్షోభం లోకి నెట్టేస్తారా? ఉహూ! ఇది కాదు పద్ధతి. ఇంత పెద్ద యంత్రాంగముంది. నిజంగా నల్ల కుబేరులను ఏరి పారేయాలనుకునే చిత్త శుద్ధే ఉంటే సర్జికల్ స్ట్రైక్ వారి పైన్నే చేయాలి...సామాన్య ప్రజల పైన కాదు. అధికారులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి చూడండి. వారంలో నల్ల కుబేరులంతా కటకటాల వెనకుంటారు." రాంబాబు ఆవేశం అర్ధం చేసుకోవచ్చు. అతను చెప్పే నిజాలు కాదన లేనివి. కళ్ళ ముందు జరుగుతున్న సత్యాలే.

" ఎవరో ఒకరు ముందడగు వేయాలి. కుళ్ళి పోయిన వ్యవస్థను సంస్కరించడానికి ఇప్పటికైనా ఒకరు దృఢ సంకల్పంతో ముందుకొచ్చారు. ఇన్నాళ్ళకు ఒక ప్రధాని 50 రోజుల్లో ఒక కొత్త భారత దేశాన్ని ఆవిష్కరిస్తానంటున్నారు. ఒక అవకాశం ఇద్దాం. చూద్దాం ఏమి జరుగుతుందో..? తాత్కాలిక పరిష్కార మార్గంగా డెబిట్; క్రెడిట్ కార్డ్స్; ఆన్ లైన్ బ్యాంకింగ్ వగైరా నగదు రహిత మార్గాలు సూచిస్తున్నారు గదా!"

"ఎన్ని అవకాశాలిచ్చినా నల్ల ధనాన్ని పూర్తిగా అరి కట్ట లేం. సరే 50 రోజుల తర్వాత నల్ల ధనమంతా వెలికి తీసేశాం అని గట్టిగా చెప్ప గలరా? ఇలాంటి వ్యవస్థ వున్నంత వరకు వ్యవస్థలో నల్ల ధనం ఒక భాగం. ఒక చర్యతో; ఒక రోజులో నల్ల ధనం పోదు. ఇది నిరంతర ప్రక్రియ. నిత్యం సర్జికల్ దాడి జరగాలి. అన్ని వ్యవస్థలూ సమన్వయంతో పని చేయాలి.నిజాయితీగా నిరంతరం యుద్ధం చేయాలి. భారత ఆర్థిక వ్యవస్థ 90 శాతం కరెన్సీ పైనే నడుస్తోంది. గ్రామీణ భారతంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఇంకా పుంజుకోనే లేదు. ఇంకా చాలా మందికి అకౌంట్సే లేవు. అక్షరాస్యత అంతంత మాత్రంగా వున్న పల్లె జనాలు స్మార్ట్ కార్డ్స్; డెబిట్ కార్డ్స్,క్రెడిట్ కార్డ్స్ ఎలా వాడతారు? తగిన మౌలిక వసతులు కల్పించ కుండా నగదు రహిత వ్యవస్థను రాత్రికి రాత్రే ఎలా ఊహించ గలం? సాధక బాధకాలు పై వారికి తెలియవా? తెలిసినా సామాన్యుడేం చేస్తాడులే అని నిర్లక్ష్యమా? ఏమైనా మాట్లాడితే దేశ ద్రోహులంటారు. దేశ భక్తి వారికే వున్నట్లు...ప్రశ్నించే వారంతా టెర్రరిస్ట్ లయినట్లు ఎదురు దాడి చేస్తున్నారు. ఈ మధ్య ఇదో ఫ్యాషన్ అయి పోయింది. "

"కరెక్టే. ఇప్పటికిప్పుడే నగదు రహిత భారతాన్ని వూహించడం కష్టం. కొంత గ్రౌండ్ వర్క్ చేసి వుండ వలసింది. కొంత టైం ఇచ్చివుండాల్సింది. కానీ ఇప్పుడు మనం చేయ గలిగింది కూడా ఏమీ లేదు. ఈ సంక్షోభం నుంచి బయట పడే మార్గాల్ని అన్వేషించడం తప్ప. "

"ఇంకో విషయం చెప్పనా? బడా బడా వ్యాపారులకు ఏడు వేల కోట్ల పై చిలుకు అప్పులు రద్దు చేసేశారు. కష్టార్జితాన్ని అంతో-ఇంతో బ్యాంకుల్లో పొదుపు చేసుకునే సామాన్యుడి డిపాజిట్ల పైన వడ్డీ తగ్గించేశారు. పెన్షందార్ల డిపాజిట్ల పైన తగ్గించేశారు.

వడ్డీలపై ఆధార పడిన బతుకులు చితికి పోతాయి. బడా బాబులకు అప్పులు కోట్లల్లో రద్దు...వాళ్ళేమో విదేశాల్లో స్వర్గ సౌఖ్యాలు అనుభవిస్తుంటారు. మన వాళ్ళు ఇలా రెండు వేలకు; మూడు వేలకు బ్యాంకుల ముందు రోడ్ల మీద తాము దాచుకున్న డబ్బు కోసం అడుక్కుంటుంటారు. కాకుల్ని కొట్టి గద్దలకి వేయడమంటే ఇదే మరి! మళ్ళీ... ప్రతి ఒక్కడూ తాము పేదల కోసమే పుట్టామని ఫోజు. ఇదీ వ్యవస్థ.!"

"బడా బాబుల పని పడతామంటున్నారు కదా? సామాన్యులకు ఇంక మంచి రోజులే అంటున్నారు. కొంత కాలమాగండి. ఏం జరుగుతుందో చూద్దాం!"

"ఆకలితో వున్న వాడు గంజి నీళ్ళడిగితే ఆర్నెల్లాగు పరమాన్నం పెడదామన్నట్లుంది. అంత వరకు వాడు బతికితే కదా ఫలితాలనుభవించడానికి. ప్రజాస్వామ్యంలో ఒంటెద్దు పోకడలు; ఏక పక్ష నిర్ణయాలు; ఎదురు దాడులు మంచివి కావు. ఇంత పెద్ద యజ్ఞానికి అన్ని వర్గాల మద్దతు అవసరం. ఒంటి చేత్తో కాదు... సమిష్టిగా నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. ఇప్పటికైనా పంతాలకి పోకుండా మేధావులతో; ఆర్థిక వేత్తలతో సంప్రదించి తక్షణ తరుణోపాయాలు ఆలోచించడం ఉత్తమం. మళ్ళీ సాధారణ పరిస్థితులు ఎంత త్వరగా తెస్తే అంత మంచిది. సామాన్యునికి ఎంతో ఉపకారం చేసిన వారవుతారు. " ముగించాడు రాంబాబు.

మా వాదనలు ఎలా ఉన్నా ఫలితాలు బాగుంటే చాలు. పెద్ద నోట్ల రద్దువల్ల సామాన్యుల కష్టాలు కళ్ళెదుట కనిపిస్తున్నాయి. బడా బాబులు కష్ట పడుతున్నారా?...సుఖ పడుతున్నారా? తెలియడం లేదు. వారికి సినిమా చూపిస్తామంటున్నారు. ఎలాంటి సినిమా అనేది 50 రోజుల తర్వాత తెలుస్తుంది. ఏదేమైనప్పటికి సామాన్య జనాలలో ఇప్పుడున్న భయాందోళనలు తక్షణం తగ్గించాలి. ఈ సంక్షోభం నుంచి వెంటనే బయట పడే మార్గం ఆలోచించాలి. వ్యవస్థల పైన నమ్మకం కలిగించాలి.

ఇంతకీ ప్రధాని మనసులో ఏముందో తెలియదు; 50 రోజుల తర్వాత ఎలాంటి భారతం ఆవిష్కరిస్తారో తెలియదు. కాని ఆయన మాటల్లో విశ్వాసం వుంది. ఏదో సాధించాలని తపన ఉంది. నిర్దిష్ట ప్రణాళిక ఏదో ఉన్నట్లుంది. లేకుంటే "బంగారు భవిష్యత్ కోసం కొంత కాలం కష్ట పడండి."అని ధైర్యంగా ఏ ప్రధాని చెప్పలేడు. కష్టమయినా ప్రజలూ సిద్ధ పడ్డారు. ఆయనేదో నూతన భారతాన్ని స్వప్నం కంటున్నారు. ఆ కల సాకారమవ్వాలని మనమూ ఆకాంక్షిద్దాం. - మనసులో అనుకుంటూ ఆనాటి వాకింగ్ ముగించి రాంబాబు నుంచి సెలవు తీసుకుని ఇంటిముఖం పట్టాను.